




	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	39	24
భద్రాద్రి	42	28



విద్యుత్ వెలుగుల్లో ఖమ్మం కమాన్‌బజార్‌లోని జామా మసీదు

ఈద్ ముబారక్

- ముగిసిన ముస్లింల రంజాన్ ఉపవాస దీక్షలు
- సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు
- ఇరు జిల్లాల్లో ముస్తాబైన ఈద్గాలు

ముస్లింలకు అత్యంత పవిత్రమైన పండుగ రంజాన్‌కు ఈద్గాలన్నీ ముస్తాబయ్యాయి. రంజాన్ మాసంలో నెలరోజుల కఠోర ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలకు బుధవారం నెలవంక కనపడటంతో దీక్షలు ముగిశాయి. దీంతో ఇరు జిల్లాల్లోని ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్‌ను గురువారం ఘనంగా జరుపుకోనున్నారు. మసీదులను విద్యుద్దీపాలతో అందంగా అంకరించారు.

-ఖమ్మం ఖానాపురం హవేలి

మంత్రి తుమ్మల శుభాకాంక్షలు 6



ఖమ్మం కమాన్‌బజార్‌లో కొనుగోళ్ల సందడి

'ప్లానింగ్' పక్కదారి!



- నగరంలో 'మాస్టర్‌ప్లాన్' నిబంధనలకు వక్రభాష్యం
- అపార్ట్‌మెంట్ల నిర్మాణాలకు అడ్డగోలు అనుమతులు
- చక్రం తిప్పుతున్న కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు
- ముందు తిరస్కరణ.. బేరం కుదిరాక బేషరతుగా...
- ఒక్కో అనుమతికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వసూళ్లు
- ప్లాన్లలో లొకేషన్లు మార్చి ఉన్నతాధికారులను ఏమార్చుతున్న వైనం
- ఆక్రమిత స్థలాల్లోనూ నిర్మాణాలకు దర్జాగా అనుమతులు

ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)లో కొందరు అవినీతి అధికారులు తమదైన మాస్టర్ మైండ్‌తో నగర 'మాస్టర్‌ప్లాన్'కు వక్రభాష్యం చెబుతున్నారు. ముడుపులు పుచ్చుకొని, నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాలకు యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారు. టౌన్ ప్లానింగ్‌లోని కొందరు అధికారులు మాస్టర్‌ప్లాన్‌లోని లోపాలను ఆసరా చేసుకొని చెలరేగిపోతున్నారు. బేరం కుదరక ముందు ఒకలా, కుదిరాక మరోలా వ్యవహరిస్తూ అనుమతులు మంజూరు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ప్రధానంగా అపార్ట్‌మెంట్ల నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. మాస్టర్ ప్లాన్ నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు చేపట్టే కొందరు బిల్డర్లకు టౌన్ ప్లానింగ్‌లోని అధికారులు వత్తాసు పలుకుతున్నట్టు తెలుస్తోంది. అపార్ట్‌మెంట్ల అనుమతుల్లో లొసుగులు తెలియని సామాన్యులు.. ఫ్లాట్లు కొన్న తర్వాత ఎదురవుతున్న సమస్యలతో లబోదిబోమంటున్నారు.

ఖమ్మం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్లకు అనుగుణంగా లేకపోయినా... బఫర్‌జోన్లలో ఉన్నా.. నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు మంజూరు చేయకూడదు. కానీ ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్‌లోని కొందరు అధికారులు కాసుల కక్కుర్తితో పెద్ద మాస్టర్‌ప్లాన్‌నే అమలు చేస్తున్నారు. నగరంలో ఎవరైనా నిర్మాణాలు చేపట్టాలి అంటే టీఎస్ బీపాస్ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించే సదరు అధికారులు మాస్టర్‌ప్లాన్ ప్రకారం అనుమతులు ఇవ్వడం కుదరదంటూ తిరస్కరిస్తారు. దీంతో దరఖాస్తుకు చెల్లించిన నగదు కూడా వెనక్కి రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఆయా దరఖాస్తుదారులు ఎంత తిరిగినప్పటికీ పట్టించుకోని అధికారులు... పెద్ద స్థాయి బిల్డర్లకు సంబంధించిన అపార్ట్‌మెంట్ల దరఖాస్తులను మాత్రం దగ్గరుండి మరీ అనుమతులు ఇప్పిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా బిల్డర్లకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినప్పుడు ముందుగా తిరస్కరించి, ఆ తర్వాత అదే వ్యక్తులతో బేరాలు కుదుర్చుకుని బేషరతుగా అనుమతులు ఇస్తున్నారని చెబుతున్నారు. ఒక్కో అపార్ట్‌మెంట్ అనుమతి కోసం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ముడుపులు తీసుకుంటున్నారని తెలుస్తోంది. నగరంలో పదులసంఖ్యలో అపార్ట్‌మెంట్లకు, బఫర్ జోన్లలో బహుళ అంతస్థుల నిర్మాణాలకు అనుమతులు మంజూరుచేసి రూ.కోట్లలో దండుకుంటున్నారన్న ప్రచారం ఉంది.

దర్జాగా విక్రయాలు

తిలాపాపం తలా పిడికెడు అన్నట్టు కొందరు బిల్డర్లు టౌన్ ప్లానింగ్ అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి అనుమతులు పొందుతున్నారు. అనుమతులను ఆసరాగా చేసుకుని తక్కువ ధరలకే ఫ్లాట్లు అంటూ ప్రచారం చేస్తూ.. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు విక్రయించి చేతులు దులుపుకొంటున్నారు. వాటితో బ్యాంకు లోన్లు సైతం పొందుతున్నట్టు వినికిడి. తమ దగ్గర కొనుగోలు చేసిన వారికి

మిగతా 6వ పేజీలో...

వర్షాకాలంలో ఎగువన కురిసే వర్షాలతో పొంగి ప్రవహించే మున్నేరు వరదతో ఖమ్మం నగరంలోని పలు కాలనీలతోపాటు ఖమ్మం రూరల్ మండలంలోని పలు గ్రామాలు వరదమయం అవుతుండడంతో పూర్తి రక్షణకు చర్యలు మొదలయ్యాయి. గతేడాది మున్నేరు వరద కారణంగా సుమారు 3వేల కుటుంబాలు వరద ముంపునకు గురికాగా, మరికొన్ని కుటుంబాలు వరద బారిన పడి నష్టపోయాయి. అనేక ఇళ్లు వరదకు కొట్టుకుపోగా ఒకరు మృతి చెందిన విషయం విదితమే. ఆస్తులకు తీవ్ర నష్టం కలిగింది.

మున్నేరు వరదకు చెక్



రెండువైపులా రక్షణ గోడల నిర్మాణానికి శ్రీకారం

- రూ.690కోట్ల అంచనా వ్యయం
- పనులు 24నెలల్లో పూర్తయ్యేలా కార్యాచరణ
- మంత్రులు తుమ్మల, పొంగులేటి పర్యవేక్షణ
- కాంక్రీట్ గోడల నిర్మాణం రాష్ట్రంలోనే తొలిసారి
- గతేడాది వరదతో లోతట్టు ప్రాంతాలు అతలాకుతలం

ఖమ్మం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మున్నేరు లోతట్టు వాసులను వరద ముంపు నుంచి కాపాడేందుకు మున్నేరుకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణానికి ప్రభుత్వం రూ.690.72కోట్లు మంజూరు చేయగా, ఇటీవలే టెండర్ల ప్రక్రియ పూర్తిచేశారు. పటేల్ కంపెనీ, సీఐవీటీ కంపెనీ జాయింట్‌గా ఈ గోడల నిర్మాణ పనులు చేపట్టారు. గతంలో వరద నివారణకు కరకట్టల నిర్మాణం ఉండగా దీనికి ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలోనే మొదటి ప్రయత్నంగా కాంక్రీట్ గోడల నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఇటీవలే పొదలను శుభ్రం చేసి ముందుగా పునాది తవ్వకాల పనులను ప్రారంభించారు. మొత్తం రూ.690.72 కోట్లతో చేపడుతున్న ఈ వరద నివారణ గోడల పనులు 24నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

గోళ్లపాడు నుంచి ప్రకాష్‌నగర్ చెక్‌డ్యాం వరకు 8.50 కిలోమీటర్ల పొడవున రెండువైపులా 17కి.మీ. పొడవున గోడల నిర్మాణం జరగనుంది. 6.50మీటర్ల పునాదులతో 3అడుగులు వెడల్పుతో 6 నుంచి 11 మీటర్ల ఎత్తులో గోడనిర్మాణం జరగనుంది. మున్నేరుకు అవతల ఇవతల గోడల మధ్య దూరం 230 మీటర్లలో నిర్మాణం కానుంది. అలాగే ప్రధాన రక్షణ గోడల పక్కనే 20మీటర్ల వెడల్పు 3 నుంచి 4మీటర్ల ఎత్తులో డ్రెయిన్ల నిర్మాణం కూడా ఇరువైపులా నిర్మించబోతున్నారు.

గత వర్షాకాలంలో మున్నేరుకు ఎన్నడూ లేని విధంగా 33అడుగుల ఎత్తున వరద ముంచెత్తడంతో ఖమ్మం నగరంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, జలగంనగర్, పద్మావతినగర్, గణేష్‌నగర్, ధంసలాపురం, ప్రకాష్‌నగర్, త్రీటౌన్ ఏరియా, సుందరయ్యనగర్, ఎఫ్‌సీఐ గోడౌన్‌తోపాటు రూరల్ మండలంలోని కరుణగిరి, పోలేపల్లి, పెద్ద తండా, రాజీవ్‌గృహకల్ప తదితర కాలనీల్లో వరదనీరు చేరింది. అనేక ఇళ్లు మున్నేరు వరదలో మునగగా.. కట్టుబట్టలతో బయటపడ్డారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని వరద కట్టలు మంజూరయ్యాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించడంతో మున్నేరుకు ఇవతలివైపున పనులు సాగుతున్నాయి. మున్నేరుకు అవతలివైపు పాలేరు నియోజకవర్గం కావడంతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అటువైపు పనులు కూడా వేగంగా చేపట్టాలని ఆదేశించడంతో అటు కూడా మొదలయ్యాయి.

ప్రధానంగా ఖమ్మం నగరం మున్నేరు బారినపడకుండా ఉండేందుకు టెండర్ల ప్రక్రియను ఇటీవల త్వరితగతిన పూర్తిచేయించారు. గత ప్రభుత్వ హయాంలోనే మున్నేరు వరద నివారణ రక్షణ గోడలకు పరిపాలన అనుమతి లభించింది. దీంతో మంత్రి తుమ్మల త్వరితగతిన పనులు ప్రారంభించాలని, గోడలు రక్షణతో ఖమ్మంలోకి వరద రాకుండా చూడాలని అధికారులకు నిర్దేశించారు. ప్రస్తుతం ఖమ్మం గోళ్లపాడు సమీపంలో పునాది నిర్మాణానికి ఎక్స్‌కవేటర్లతో వేగంగా పనులు సాగుతున్నాయి. మరోవైపు అడుగున ఇసుక, మట్టి, రాయి నాణ్యతా పరీక్షలు కూడా అధికారులు నిర్వహిస్తున్నారు.

మున్నేరుకు రెండువైపులా వరద గోడలు నిర్మించే ప్రదేశాన్ని ఇప్పటికే శుభ్రం చేసి పనులు నడిపిస్తున్నారు. మున్నేరు వరద గోడల పనులు ప్రారంభించామని 24నెలల్లో వీటిని పూర్తిచేస్తామని నీటిపారుదలశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 158ఎకరాల భూసేకరణ అవసరం ఉంది., సెంట్రల్ డిజైన్ కార్యాలయం నుంచి ఈ వరద నివారణ గోడలకు డిజైన్ చేయించారు. రాష్ట్రంలోనే వరద నివారణగోడలు చేపట్టడం మొదటిసారి.



రక్షణ గోడల నిర్మాణానికి పునాదులు తవ్వుతున్న దృశ్యం



మణుగూరులో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కాంగ్రెస్‌తోనే దేశ భవిష్యత్తు

- లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం చేకూర్చాలి
- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

6



ఖమ్మం అటవీ పార్కులో కాంగ్రెస్ నాయకులతో మంత్రి తుమ్మల

అర్బన్ పార్కులో చెక్ డ్యామ్‌లు

- పిల్లలు ఆటలు ఆడుకునేలా ఏర్పాట్లు చేయాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

6

కుటుంబాన్ని చిదిమేసిన ఆర్థిక సమస్యలు

రెండు నెలల క్రితం భర్త ఆత్మహత్య

మనోవేదనతో కుమారుడితో కలిసి భార్య బలవన్మరణం

6

అనుమానంతో భార్యను హతమార్చాడు..

కూసుమంచి మండలం నర్సింహులగూడెంలో విషాదం

7

రేణుకాచౌదరి అనే నేను..



ఖమ్మం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాసనసభ్యుల కోటాలో తెలంగాణ నుంచి ఏకగ్రీవంగా రాజ్యసభకు ఎన్నికైన కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి బుధవారం ఢిల్లీలోని రాజ్యసభ చైర్మన్ జగదీష్ ధన్కడ్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లానుంచి రేణుకాచౌదరి 1986, 1992లో టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నిక కాగా 2012లో కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1999, 2004లో ఖమ్మం లోక్‌సభ నుంచి ఎంపీగా విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా రాజ్యసభలో సీనియర్ సభ్యురాలిగా ఉన్న రేణుకాచౌదరి ఇటీవల మళ్లీ కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఢిల్లీలో బుధవారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఖమ్మం జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ఎంపీగా ప్రమాణం చేసిన రేణుకాచౌదరికి కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రేణుకాచౌదరి భర్త శ్రీధర్‌చౌదరి, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, దీపక్‌చౌదరి, వడ్డెబోయిన నర్సింహారావు పాల్గొన్నారు.

వినయ్ మృతి కేసులో ఐదుగురి అరెస్టు

- మోహనసాయి ఫైనాన్స్ యజమాని సైదారావు కూడా...
- మరో భాగస్వామిని అరెస్టు చేయకపోవడంపై అనుమానాలు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 10: ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్లు వెంటపడటంతో చెరువులో పడి మృతి చెందిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన వినయ్ పర్మార్(21) కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి బుధవారం రాత్రి వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వినయ్, రాజస్థాన్‌కు చెందిన జశ్వంత్‌సింగ్ (అజయ్‌కుమార్)... కొంతకాలం క్రితం మార్బుల్ పని చేసేందుకు ఖమ్మం నగరానికి వచ్చారు. ఈ క్రమంలో వీరిద్దరూ నగరంలోని మోహన్‌సాయి ఫైనాన్స్‌లో బైక్‌లు తీసుకున్నారు. అయితే కిస్తీలు కట్టకపోవడంతో ఈ నెల 5న రికవరీ ఏజెంట్ ధరావత్ రాంచందర్, సేల్స్‌మెన్ శీలం అజయ్‌కుమార్‌లు వినయ్ వద్దకు వెళ్లి మరో వ్యక్తి నాగిలి శ్రీను (వాచ్‌మెన్)తో కలిసి దాడికి దిగారు. దీంతో భయంతో వినయ్ పారిపోతూ ఖానాపురం చెరువులోకి దిగాడు. అయితే వాచ్‌మెన్ శ్రీను అతడిపైకి రాయి విసరడంతో వినయ్ చెరువులో మరింత లోతుకు వెళ్లి మునిగి చనిపోయాడు. ఈ కేసులో ధరావత్ రాంచందర్, శీలం అజయ్‌కుమార్, వాచ్‌మెన్ నాగిలి శ్రీను, సాలె రవి, ఫైనాన్ కంపెనీ యజమాని కొనిదిన సైదారావులపై ఖానాపురం హవేలి పోలీసులు కేసు నమోదు చేశారు. రాంచందర్, అజయ్‌కుమార్, శ్రీను, రవిలను ఈనెల 8న అరెస్ట్ చేసి రిమాండ్ చేయగా, ఫైనాన్స్ కంపెనీ యజమాని సైదారావును బుధవారం రిమాండ్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

కేసులో పలు అనుమానాలు ?

ఫైనాన్స్ కంపెనీ వారికి కిస్తీలు చెల్లించకపోవడంతో వారు వెంటపడటంతో వినయ్ భయంతో చెరువులో దూకి మృతి చెందాడని పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ కేసులో కొన్ని అనుమానాలు తలెత్తుతున్నాయి.. సైదారావు పేరు మీద ఫైనాన్స్ కంపెనీ లేబర్ లైసెన్స్, మున్సిపల్ అనుమతులు ఉన్నాయి. వాటి ఆధారంగానే పోలీసులు సైదారావుపై కేసు నమోదు చేశారు.



వినయ్ పర్మార్ (ఫైల్)

కానీ ఈ ఫైనాన్స్ కంపెనీలో మరో పార్టనర్ పేరు మాత్రం బయటకు రాలేదు. దీనిపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడు వినయ్ స్థానికుడు కాకపోవడంతో కేసును బలహీనపరిచారా..? లేక ఫైనాన్స్ కంపెనీ వారు పలుకుబడితో మలుపు తిప్పారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఖానాపురం హవేలి సీఐ భానుప్రకాష్‌ను సంప్రదించగా... 'లేబర్ లైసెన్స్, మునిసిపల్ పర్మిషన్లు సైదారావు పేరిటే ఉన్నాయి. వాటి ప్రకారం అతడిని రిమాండ్ చేశాం. ఇంకా విచారణ జరగాల్సింది ఉంది. పన్నులను కూడా పరిశీలించాల్సి ఉంది..' అని తెలిపారు.

నేడు రంజాన్



- దర్శనమిచ్చిన నెలవంక
- ముగిసిన ముస్లింల ఉపవాస దీక్షలు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేసిన అధికారులు
- ముస్తాబైన ఈద్గాలు
- పండుగ ఏర్పాట్లలో బిజీ..
- రద్దీగా దుకాణ సముదాయాలు
- ఖమ్మంలో ప్రత్యేకంగా ఏర్పాటైన రంజాన్ బజార్
- అర్ధరాత్రి వరకు విక్రయాలు

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 10: నెలవంక దర్శనంతో రంజాన్ పండుగను ముస్లింలు గురువారం నిర్వహించనున్నారు. నెలవంక కనిపించడంతో పుణ్యఫలాల పవిత్ర రంజాన్ మాసం 30 రోజుల ఉపవాస దీక్షలు ముగిశాయి. నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు కొనసాగించిన ముస్లింలు బుధవారం సాయంత్రం దీక్షలు విరమించి గురువారం రంజాన్ పండుగను జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. ఈద్-ఉల్-ఫితర్ జరుపుకోవడానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఈద్గాలు, దర్గాలను ముస్తాబు చేశారు. ముస్లింలు రంజాన్ వేడుకలు జరుపుకోవడానికి మసీదుల వద్ద మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నగరంలోని గాంధీచౌక్, గొల్లగుడెం ఈద్గాల వద్ద రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించే ప్రార్థనలకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నెల రోజుల పాటు రంజాన్ దీక్షలు పాటించిన ముస్లింలు పవిత్ర మాసం అనంతరం షవ్వాల్ నెల మొదటి రోజు జరుపుకొనే పండుగే ఈద్-ఉల్-ఫితర్ అంటారు. నమాజ్ చేసిన అనంతరం ఇష్రాఖ్ సమయం ప్రారంభమైన తర్వాత ఈద్-ఉల్-ఫితర్ రెండు రకాలుగా నమాజ్ చేస్తారు. అనంతరం ఒకరినొకరు ఈద్-ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకొంటారు. ధనిక, పేద అనే తేడా లేకుండా సమాజంలోని అందరూ ఒకేవిధమైన దినచర్యను పాటిస్తారు. అంతా ఒకే భావన, ప్రేమాభిమానాలను చాటడానికి ఈ పండుగ ప్రముఖ పాత్ర పోషిస్తున్నది.

ఫిత్రా దానం..

షవ్వాల్ మాసపు మొదటి రోజు ఈద్-ఉల్-ఫితర్ పండుగనాడు ప్రార్థనలకు ముందు పేదలకిచ్చే దానమే ఫిత్రా. అందుకే ఈ పండుగకు ఈద్-ఉల్-ఫితర్ అని పేరు వచ్చింది. షరియత్ పరిభాషలో ఫిత్రా అంటే ఉపవాసాల పాటింపులో మనిషి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పొరపాట్లు, లోపాలు జరుగుతూనే ఉంటాయి. ఆ లోపాలు పోయేందుకు చేసేదే ఫిత్రాదానం. సమాజంలోని నిరుపేదలు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఈ దానం చేస్తారు. ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ కోసం ఈద్గాలు, మసీదులను ముస్తాబు చేశారు. ఫజర్ నమాజ్ అనంతరం ఇష్రాఖ్ నమాజ్ సమయం ప్రారంభమైన తర్వాత నమాజ్ చేస్తారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొంటారు.

ముస్లింలకు ప్రముఖుల శుభాకాంక్షలు

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని ముస్లింలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర(గాయత్రి రవి), ఎమ్మెల్సీ తాతా మధు, కలెక్టర్ వీపీ గౌతమ్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మేయర్ పునుకొల్లు నీరజ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు చేపట్టిన ఉపవాస దీక్షల పుణ్య ఫలంతో రాష్ట్రం, జిల్లా ప్రగతిని సాధించాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని కోరారు.

పండగ సందడి

రంజాన్ పండుగ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ముస్లింలు పండగకు కావాల్సిన సామగ్రి కొరకు గత రెండు రోజులుగా షాపింగ్ నిర్వహిస్తుండటంతో నగరంలోని ప్రధాన వీధుల్లో సందడి నెలకొన్నది. సంవత్సరంలో రెండు పండగలే (రంజాన్, బక్రీద్) ఘనంగా జరుపుకొనే ముస్లింలు రంజాన్ పండుగ సందర్భంగా భారీగానే ఖర్చు చేయనున్నారు. దీంతో గత రెండు రోజులుగా నగరంలోని కమాన్‌బజార్, కస్బాబజార్, స్టేషన్ రోడ్, గాంధీచౌక్ తదితర ప్రాంతాలోని షాపులన్నీ ముస్లింలతో కళకళలాడుతున్నాయి. నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో మంగళ, బుధవారాలు రాత్రి 11 గంటల వరకు ప్రత్యేక మార్కెట్‌లో అమ్మకాలు జరిగాయి.

మంత్రి తుమ్మల శుభాకాంక్షలు



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం జరుపుకొనే రంజాన్ పండుగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా అల్లా దీవెనలు నిండుగా అందుకోవాలని అభిలషించారు. క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, దాతృత్వం, ప్రేమ, దయ పెంపొందాలని ఆకాంక్షించారు.

కుటుంబాన్ని చిదిమేసిన ఆర్థిక సమస్యలు

- వ్యవసాయంలో నష్టంతో పెరిగిపోయిన అప్పులు
- రెండు నెలల క్రితం భర్త ఆత్మహత్య
- మనోవేదనతో కుమారుడితో కలిసి భార్య బలవన్మరణం



సక్రాం(ఫైల్)



నేవుత్ర, రాంచరణ్

కామేపల్లి, ఏప్రిల్ 10: ఆర్థిక సమస్యలు ఓ కుటుంబాన్ని చిదిమేశాయి. వ్యవసాయం చేస్తే లాభాలొస్తాయని అప్పులు తెచ్చిమరి సాగు చేస్తే చివరకు అప్పులే మిగిలాయి. ఆ అప్పులు ఎలా తీర్చాలో తెలియక రెండు నెలల క్రితం ఇంటి యజమాని పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తాళికట్టి అండగా నిలిచిన భర్త అనూహ్యంగా దూరం కావడంతో మనోవేదనకు గురైన అతడి భార్య తన కుమారుడితో కలిసి ఎలుకల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం గోవింద్రాలలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోవింద్రాలకు చెందిన లావుడ్య సక్రాం(36) నేవుత్ర(32) దంపతులకు కుమారుడు రాంచరణ్(11), కుమార్తె అలేఖ్య ఉన్నారు. సక్రాం తనకున్న ఎకరన్నర భూమితోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేశాడు. అయితే దిగుబడులు సరిగా రాకపోవడంతో ఇంట్లో ఆర్థిక సమస్యలు పెరిగాయి. వీటికి తోడు సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదన చెంది జనవరిలో పురుగులమందు తాగి ఆహ్మహత్య చేసుకున్నాడు. అయితే భర్త చనిపోయినప్పటినుంచి మనోవేదనతో ఉన్న సక్రాం భార్య నేవుత్ర ఈనెల 3న తన కుమారుడు రాంచరణ్‌తో కలిసి కూల్‌డ్రింక్‌లో ఎలుకలమందు కలుపుకొని తాగింది. ఇది గమనించిన బంధువులు వారిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే నేవుత్ర పరిస్థితి విషమించడంతో ఇద్దరినీ హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 9వ తేదీన నేవుత్ర, 10న రాంచరణ్ మృతి చెందాడు. దీంతో వారి కుమార్తె అలేఖ్య ఒంటిరిగా మిగిలిపోయింది. ప్రస్తుతం అలేఖ్య సింగరేణి మండలంలోని ఓ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. నేవుత్ర తమ్ముడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కామేపల్లి ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ప్రార్థనా ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు: సీపీ

ఖమ్మంక్రైం, ఏప్రిల్10: రంజాన్ పండుగ సందర్భంగా ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఈద్గా ప్రార్థనా ప్రాంతాల్లో పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్టు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. నగరంలోని గొల్లగూడెం ఈద్గా ప్రాంతాన్ని బుధవారం సీపీ సందర్శించారు. ట్రాఫిక్, పార్కింగ్, భద్రతపై నిర్వాహకులతో పాటు అధికారులతో చర్చించారు. ప్రార్థనల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య రాకుండా చూడాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీ ప్రసాదరావు, టౌన్ ఏసీపీ రమణమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు తిరువీధి సేవ

భద్రాచలం, ఏప్రిల్ 10: భద్రాద్రి రామయ్యకు బుధవారం రాత్రి చలువచప్పర వాహనంపై తిరువీధిసేవ నిర్వహించారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు తొమ్మిది నుంచి ప్రారంభం కాగా ఈ సందర్భంగా ప్రతి రోజు రాత్రి స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించనున్నారు. అందులో భాగంగా బుధవారం స్వామివారికి చలువచప్పర వాహనంపై తిరువీధిసేవ నిర్వహించగా భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా బ్రహ్మోత్సవ కలశస్థాపన

- జమలాపురంలో ఘనంగా నవరాత్రి బ్రహ్మోత్సవాలు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 10: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం యాగశాలలో సర్వతోభద్ర కలశ స్థాపన బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రాతఃకాల అర్చన, నీరాజనం అనంతరం వేద మంత్రోచ్చారణలతో సర్వదేవతల ఆవాహనం, మండపారాధనలు, అగ్నిమథనం చేశారు. గోపూజ నిర్వహించి రుగ్వేదహోవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగింది. దేవాలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

మిగిలింది ఆరు రోజులే

- మందకొడిగా శ్రీరామనవమి టికెట్ల విక్రయాలు
- 15,860 టికెట్లకు గాను 1910 టికెట్ల విక్రయాలు
- విక్రయాలపై ఎండలు, ఎన్నికల ప్రభావం

భద్రాచలం, ఏప్రిల్ 10: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 17న శ్రీరామనవమిని పురస్కరించుకొని నిర్వహించే శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణంను వీక్షించేందుకు టికెట్ల విక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. దేవస్థానం ఆధ్వర్యంలో రామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు 21 సెక్టార్ల ద్వారా 15,860 టికెట్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. 1,910 టికెట్లు భక్తులు కొనుగోలు చేయగా 13,950 టికెట్లు ఉన్నాయి. ఇందులో ఆన్‌లైన్‌లో 11,440 టికెట్లు అందుబాటులో ఉంచగా 1,732 టికెట్లు ఇప్పటి వరకు భక్తులు కొనుగోలు చేశారు. కాగా ఇంకా 9,708 టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆఫ్‌లైన్ ద్వారా మొత్తం 4,420 టికెట్లు అందుబాటులో ఉంచగా ఇప్పటి వరకు 178 టికెట్లు మాత్రమే భక్తులకు విక్రయించారు. ఆఫ్‌లైన్‌లో 4,242 టికెట్లు విక్రయించాల్సి ఉంది. రూ.7,500 విలువ గల ఉభయదాతల టికెట్లు మొత్తం 1000 ఉండగా ఆన్‌లైన్‌లో 750 అందుబాటులో ఉంచగా 254 ఇప్పటి వరకు భక్తులు కొనుగోలు చేశారు. 496 టికెట్లు ఆన్‌లైన్‌లో ఇంకా అందుబాటులో ఉన్నాయి. ఆఫ్‌లైన్‌లో 250 టికెట్లు అందుబాటులో ఉంచగా 83 టికెట్లు ఇప్పటి వరకు భక్తులు కొనుగోలు చేశారు. ఇంకా 337 టికెట్లు అందుబాటులో ఉన్నాయి. రూ.2,500 విలువ గల టికెట్లు 1175 ఉండగా ఇప్పటి వరకు కేవలం 149 మాత్రమే అమ్ముడయ్యాయి. 1,026 టికెట్లు అందుబాటులో ఉన్నాయి.. రూ.2 విలువ గల టికెట్లు 380 ఉండగా 110 టికెట్లు ఇప్పటి వరకు భక్తులు కొనుగోలు చేశారు. 270 టికెట్లు ఇంకా అందుబాటులో ఉన్నాయి. నవమి టికెట్ల విక్రయాల మందకొడికి వేసవి ఎండలు, ఎన్నికలే కారణమని అంచనా వేస్తున్నాయి. అయితే రామయ్య కల్యాణానికి ఇంకా ఆరు రోజులే మిగిలా ఉండటంతో చివరి నిమిషంలో టికెట్ల విక్రాయలు జోరందుకుంటాయని అధికార వర్గాలు ఆశాభావంతో ఉన్నాయి.

ఖరారైన రైతు రుణ ప్రణాళిక

- గత ఏడాదితో పోలిస్తే స్వల్పంగా పెంపుదల



ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 10: రానున్న వానాకాలం, యాసంగి సాగుకు సంబంధించి పంటల రుణ ప్రణాళిక ఖరారైంది. గతేడాదితో పోల్స్తే జిల్లాలో సాగు చేసే ప్రధాన పంటల్లో కొన్నింటికి ఇచ్చే రుణంలో స్వల్ప పెరుగుదల ఉంది. పంట రుణ పరిమితి వివరాలను బ్యాంకు అధికారులువెల్లడించారు. జిల్లాలో ఏటా 6లక్షల ఎకరాల్లో రైతులు సాధారణ పంటలతో పాటు తోటలు, కూరగాయలు తదితరాలు సాగు చేస్తున్నారు. వీరిలో సుమారు 2 లక్షల మంది మాత్రమే బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకొంటున్నారు. రుణపరిమితి ఖరారు కావడంతో బ్యాంకుల వారీగా రుణ ప్రణాళికను రూపొందించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రధాన పంట వరితోపాటు కంది, మొక్కజొన్న, మినుములు, పెసర, శనగ, జొన్న తదితర పంటలకు రుణ పరిమితి పెంచలేదు. క్యాబేజీ, కాలిఫ్లవర్ పంటలకు రూ.35 వేల లోపు ఇవ్వనున్నారు. వంగ రైతులకు మల్చింగ్‌తో చేస్తే రూ.55 వేలు, లేకుండా సాగు చేస్తే రూ.40 వేలుగా ఖరారు చేశారు. పండ్ల తోటలు సాగు చేసే రైతులకు రూ.75 వేల లోపు ఉంది.

పత్తికి కాస్తా పెంపు..

జిల్లాలో గతేడాది 2.6లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది అంతే సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. గతేడాది ఎకరాకు రూ.45 వేలు ఇచ్చారు. ఈ ఏడాది రూ. వెయ్యి పెంచి రూ.46 వేలుగా చేశారు. దుక్కి మొదలు పంట చేతికి వచ్చే వరకు ఖర్చులు లెక్కిస్తే ఎకరాకు రూ.55 వేలకు పైగా ఖర్చు అవుతుందని రైతులు చెపుతున్నారు. డెయిరీ పెట్టుకోవాలనుకునే రైతులకు ఒక గేదె కొనుగోలుకు కేవలం రూ.33 వేలలోపు ఇవ్వాలని సూచించారు. గొర్రెలు, మేకల కొనుగోలుకు ఒక్కోదానికి రూ.24 వేలు, ఒక్కో కోడి పిల్లకు రూ.190 చొప్పున ఇవ్వాలని రాష్ట్ర స్థాయి సాంకేతిక నిపుణుల కమిటీ తీర్మానించింది. వరి పంటకు ఎకరానికి గతేడాది రూ.45 వేలు ఉండే ఈ ఏడాది కూడా అంతే మొత్తం ఇవ్వాలని ఖరారు చేశారు. మొక్కజొన్నకు రూ.28 వేలు ఉంటే ఈ ఏడాది రుణపరిమితి అంతే ఉంచారు.

రుణ పరిమితి రూపాయలలో..

పంట	2023-24	2024-25
వరి	45,000	45000
జొన్న	19,000	20,000
మొక్కజొన్న	30,000	34,000
అపరాలు	20,000	20,000
పెసర	22,000	22,000
వేరుశనగ	30,000	30,000
పత్తి	20,000	21,000
పుసుపు	80,000	80,000
ఆయిల్‌పామ్	42,000	44,000
కూరగాయలు	35,000	37,000
మామిడి	42,000	44,000

‘ప్లానింగ్’ పక్కదారి!

(5వ పేజీ తరువాయి)

అక్రమాలు తెలియకుండా ఉండేలా బిల్డర్లే దగ్గరుండీ లోన్లను ఇప్పిస్తున్నట్టు సమాచారం. అయితే ఎప్పుడైనా ఫిర్యాదులు అందినప్పుడో, మరేదైనా చిక్కులు ఎదురైనప్పుడో ఆయా ఫ్లాట్లను కొనుగోలు చేసిన వారు లబోదిబోమనాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గతంలో బఫర్ జోన్లలో వెంచర్లు చేయగా, తీరా మున్నేరు వరద ముంపనకు గురైన తర్వాతనే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ దానిపై దృష్టిసారించి చర్యలు చేపట్టారు.

లొకేషన్లు మార్చి దందా

మాస్టర్‌ప్లాన్ అడ్డంకి తలెత్తకుండా ఉండేందుకుగాను ఆ ప్లాన్‌లో రోడ్లు, ఇతర అంశాలు ఉంటే.. లోకేషన్లు మార్చి ఉన్నతాధికారులను ఏమారుస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ప్లాన్ ప్రకారం ఆయా దరఖాస్తుదారుల నిర్మాణాలకు సంబంధించిన వాటిని తిరస్కరించాలి. కానీ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేందుకుగాను దగ్గర్లో ఏదో ఒక లొకేషన్ చూపించి ప్లానర్ ద్వారా ఫైల్ కదుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్లాన్లలో లోకేషన్ ఓ చోట ఉంటే.. సంబంధిత అక్రమ నిర్మాణాలు మరో ప్రాంతంలో ఉండటం గమనార్హం.

ఇలాంటి అనుమతులు ఇచ్చిన వాటిల్లో మమతారోడ్డు, శ్రీనివాసనగర్, బల్లేపల్లి వంటి చుట్టుపక్కల ప్రాంతాలు ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగి మమతా రోడ్డులో తన భార్య పేరిట చేపట్టిన అపార్ట్‌మెంట్ నిర్మాణానికి మాస్టర్‌ప్లాన్ ప్రకారం అనుమతులు మంజూరు చేయకూడదు. ముందుగా సదరు ఉద్యోగి చేసుకున్న దరఖాస్తును తిరస్కరించిన అధికారులు.. ఆ తర్వాత రూ. 6 లక్షలు తీసుకుని అనుమతులకు ఓకే చెప్పారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంతేకాదు ఆక్రమిత ప్రైవేటు స్థలాలకు సైతం లోకేషన్లు మార్చి అనుమతులు ఇస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. శ్రీనివాసనగర్‌లోని ఓ నిర్మాణానికి సంబంధించి పక్క సర్వే నెంబరులో లొకేషన్ చూపించి ఆక్రమిత స్థలంలో నిర్మాణం చేశారు. అయినా అధికారులు కన్నెత్తి చూడలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా ఎవరైనా అలాంటి నిర్మాణాలపై ఫిర్యాదు చేస్తే, లొకేషన్ ప్రకారం అనుమతులు రద్దు చేయాలంటే ఖమ్మం నగరంలో వందల సంఖ్యలో భవనాలను కూల్చాలంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులు సెలవిస్తున్నట్టు తెలుస్తోంది.

కొత్త మాస్టర్‌ప్లాన్ వస్తే మరిన్ని ఇబ్బందులు

ఖమ్మం మాస్టర్ ప్లాన్ 1995 మాన్యువల్‌గా ఉండేది. 1999 తర్వాత డిజిటల్ చేశారు. ఆ తర్వాత 2012లో మరో మాస్టర్ ప్లాన్ రూపొందించి.. 2016లో దానిలో కొన్ని మార్పులు చేసి ప్రస్తుతం అనుమతులు ఇస్తున్నారు. అయితే కొత్తగా ఏర్పాటు చేయాలనుకున్న మాస్టర్ ప్లాన్ ఇంకా ప్రదిపాదనల దశలోనే ఉంది. కాగా కొత్తగా మాస్టర్ ప్లాన్ వస్తే ప్రస్తుతం తప్పుడు మార్గంలో అనుమతులు పొంది చేపట్టిన నిర్మాణాల్లో కొనుగోలు చేసే ప్రజలు మరిన్ని ఇబ్బందులు పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం నగరంతోపాటు, చుట్టపక్కల ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, కాల్వలు, వంతెనలు, జాతీయ రహదారి పోయే మార్గాలు, వాణిజ్య ప్రాంతాలు, నివాస ప్రాంతాలు, రవాణా సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించి కొత్త మాస్టర్ ప్లాన్‌కు ఒకే చెప్పే అవకాశం ఉంది. అలా జరిగినప్పుడు ప్రస్తుతం ఉన్న ప్రధాన రహదారులు, వాటికి దగ్గర్లో ఉండే రోడ్లు సైతం వెడెల్పు పెంచే అవకాశం ఉందన్న వాదన వినిపిస్తోంది.

లోకేషన్ మార్చడం పెద్ద నేరం
బండి జయకిషోర్, క్రెడాయ్ జిల్లా అధ్యక్షుడు



లోకేషన్ మార్చి నిర్మాణం చేయడం అపార్ట్‌మెంట్ పెద్ద నేరం. ప్రస్తుతం ఎవరైనా బిల్డర్లు కొనుగోలుదారులకు లోన్లు ఇప్పించినప్పటకీ, భవిష్యత్తులో ఎవరికైనా విక్రయించాలనుకుంటే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుంది. కొనుగోలుదారులు ప్లాటును కొనుగోలు చేయాలంటే అది పర్మిషన్ ప్లాన్ ప్రకారం ఉందా లేదా? ఆక్యుపెన్సీ సర్టిఫికేటు వంటి అంశాలు సరిచూసుకోవాలి. సెట్‌బ్యాక్ రిలాక్సేషన్‌లో 10శాతం డివియేషన్ మాత్రమే ఉండాలి. మున్సిపాలిటికి బిల్డింగ్ నిర్మాణం చేసే సమయంలో మార్టిగేజ్ చేస్తారు. కొనుగోలు చేసే సమయంలో అవి మున్సిపాలిటీ మార్టిగేజ్‌లో ఉన్నాయా లేదా అన్నది పరిశీలించుకోవాలి.

కాంగ్రెస్‌తోనే దేశ భవిష్యత్తు

- లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం చేకూర్చాలి
- రాష్ట్ర స్త్రీ,శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క



మంత్రి సీతక్కకు స్వాగతం పలుకుతున్న నాయకులు

మణుగూరు, ఏప్రిల్ 10: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు దేశ భవిష్యత్ కోసం జరుగుతున్న ఎన్నికలని, దేశ భవిష్యత్తు కోసం ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. తరతరాలుగా అణచబడ్డ వర్గాలకు ఆత్మ గౌరవాన్నిచ్చిన రాజ్యాంగాన్ని ఉంచాలా మార్చాలా అనే చర్చ జరుగుతున్న తరుణంలో జరుగుతున్న ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి ఇలాంటి కుట్రలను అడ్డుకోవాలని కోరారు.

భద్రాద్రి జిల్లా మణుగూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం పినపాక నియోజకర్గవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీతక్క మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజ్యాంగాన్ని మార్చాలని గత సీఎం కేసీఆర్ ప్రయత్నాలు చేశారన, ఇప్పుడు ప్రధాని మోదీ ఆ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు దీనిపై ఆలోచించాలన్నారు. అట్టడుగున ఉన్న దేశాన్ని స్వాతంత్ర్యం తరువాత కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పథకంలో నడిపితే ప్రధాని మోదీ మాత్రం కాంగ్రెస్ పార్టీ దేశానికి ఏం చేసిందని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. తాను చాయ్ అమ్మినట్లు చెబుతున్న రైల్వేస్టేషన్, ఫ్లాట్‌ఫాంలు కాంగ్రెస్ పార్టీనే నిర్మించిందన్న విషయాన్ని ప్రధాని మోదీ గుర్తించాలన్నారు. బీజేపీ ఇటీవల భారత దేశాన్ని పాకిస్తాన్‌తో పోల్చుతూ గౌరవాన్ని తగ్గిస్తున్నారని విమర్శించారు. గత పదేళ్లలో బీజేపీ పాలకులు దేశానికి ఏం చేశారో చెప్పకోలేకపోతున్నారన్నారు. మహబూబాబాద్ లోక్‌సభ సాథనంలో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరామ్‌నాయర్ అందరి వ్యక్తి అన్నారు. గతంలో కేంద్ర మంత్రిగా పినపాక ఏజెన్సీ అభివృద్ధి కోసం పాటుపడ్డారన్నారు. నాడు తాను టీడీపీలో ఉన్న సమయంలో ఎంపీ బలరామ్‌నాయక్ సుమారు రూ.2వేల కోట్లను తెచ్చి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశారన్నారు. 34 ఏళ్ల తర్వాత త్యాగాల కుటుంబంలో మరోసారి రాహుల్ గాంధీని ప్రధాని చేసే అవకాశం వచ్చినందున ఈ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి బలరామ్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అవిశ్రాంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి బలరామ్ నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

‘నమ్ముకున్న వాళ్లను నట్టేట ముంచావు.. రేగా’

బూర్గంపాడు: ‘బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ నాయకులను విమర్శించే అర్హత లేదు.. నమ్ముకున్న వాళ్లను నట్టేట ముంచి కాంగ్రెస్‌ను వదిలి వెళ్లిన నీవా నీతులు చెప్పేది’ అంటూ రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క. పినపాక మాజీ ఎమ్మెల్యే రేగాను ఉద్దేశించి విమర్శలు చేశారు. బుధవారం బూర్గంపాడు మండలంలో నిర్వహించిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి పేరిట పార్టీ మారింది కాక ఇప్పుడు నీతులు చెబుతున్నారా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులను విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదు అని స్పష్టం చేశారు. పార్టీ మారినందుకు ప్రజలు ఓడించారు. చాలదా అంటూ ఎద్దేవా చేశారు. రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ ను విమర్శించే హక్కు రేగా కాంతారావుకు లేదన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌ను గెలిపించండి

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్‌ను జరగబోయే పార్లమెంటరీ ఎన్నికల్లో గెలిపించి రాహుల్ గాంధీ ప్రధాని అయ్యేలా ప్రజలు సహకరించాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మణుగూరులోని శేషగిరి నగర్‌లో ఏ ప్రైవేటు కార్యాక్రమానికి హాజరయ్యేందుకు వచ్చారు. బుధవారం మణుగూరులో పర్యటించిన అనంతరం మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే పాయం,డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు పలువురు ఘనంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత మంత్రి కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజవర్గ స్థాయి పార్టీ సమావేశంలో మాట్లాడారు. ఈ ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధిలో నాడు కూడా ఎంపీగా ఉన్న బలరాం నాయక్ రెండు వేల కోట్ల రూపాయాలతో రోడ్లు, భవనాలు, ఆసుపత్రులు ఎన్నో సంక్షేమ పథకాలను ఏర్పాటు చేసి అందరివాడిగా ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చెందాలంటే మహబూబాబాద్ ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు.

అర్బన్ పార్కులో చెక్ డ్యామ్‌లు

- పిల్లలు ఆటలు ఆడుకునేలా ఏర్పాట్లు చేయాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 10: ఖమ్మం నగరంలోని అర్బన్ పార్కులో అవకాశం ఉన్న ప్రతీ చోట నీటి నిల్వలు ఉంచేందుకు చెక్ డ్యామ్‌లను ఏర్పాటు చేయటం ద్వారా వన్య ప్రాణులకు తాగునీరు, భూగర్భ జలాలు పెరగటంతోపాటు వృక్షాలకు వేసవిలో నీటి సమస్య తగ్గుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అటవీశాఖ అధికారులకు సూచించారు. బుధవారం సాయంత్రం కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లతో కలిసి మంత్రి తుమ్మల అటవీ అర్బన్ పార్కులో సేద తీరుతూ కలియ తిరిగారు. గతంలో తాను నిర్మాణం చేసిన చెక్ డ్యామ్‌లు, పార్కు అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లకు తుమ్మల వివరించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులతో తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం అర్బన్ పార్కు 250హెక్టార్ల మేరకు ఉంటుందని, గుట్టలు, నీటి నిల్వలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో మరో 15 చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలని, పార్కుకు వచ్చే పిల్లలు ఆటలు ఆడుకునేందుకు ఇసుక ఏర్పాటు చేయాలని, పార్కును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు కమర్తపు మురళి, రావూరి సైదబాబు, మిక్కిలినేని నరేందర్, మలీదు జగన్, ఆళ్ల అంజిరెడ్డి పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ నిర్వహణపై మంత్రి తుమ్మల ఆగ్రహం

- ఆకస్మికంగా తనిఖీ



ట్యాంక్‌బండ్‌పై మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 10: ‘నెలకు రూ.2.5లక్షల డబ్బులు ప్రభుత్వం నుంచి తీసుకుంటూ ట్యాంక్ బండ్ నిర్వహణ ఇలానా ఉండేది, లైట్లు లేవు, కనీసం మొక్కల మెయింటెన్స్ కూడా చూడలేరా..’ అంటూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లకారం ట్యాంక్‌బండ్ కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్ బండ్‌ను మంత్రి తుమ్మల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్ నిర్వహణ సక్రమంగా లేని విషయాన్ని గుర్తించారు. వెంటనే ట్యాంక్ బండ్ కాంట్రాక్టర్‌ను పిలిపించి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కంగారు పడిన కాంట్రాక్టర్ గతంలో లకారం ట్యాంక్ బండ్ నిర్వాహణ డబ్బులు ఇతరులు తీసుకున్నారని రెండు నెలలుగానే తనకు డబ్బులు వస్తున్నాయన్నారు. మొక్కల నిర్వహణను ఖమ్మంనగరపాలక సంస్థ పరిధిలో ఉంటుందని వివరణ ఇచ్చారు. ప్రజలు ఆహ్లాదం కోసం వచ్చే లకారం ట్యాంక్‌బండ్‌ను అందంగా ఉంచాలని ఆదేశించారు.

రుణాలు రీ షెడ్యూల్ చేయాలని వినతి

తల్లాడ, ఏప్రిల్ 10: సొసైటీల్లో రైతులు తీసుకున్న రుణాలను రీషెడ్యూల్ చేసి కొత్త రుణాలు ఇప్పించేందుకు చొరవ చూపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలను పలువురు రైతులు కోరారు. బుధవారం దమ్మపేట మండలం గండుగలపల్లిలోని నివాస గృహంలో మంత్రిని తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. పలు సమస్యల గురించి విన్నవించారు. వర్షాభావం వల్ల పంటలు సరిగా పండకపోవడంతో రైతులు నష్టాల్లో ఉన్నారని, నష్టాల్లో ఉన్న దృష్ట్యా సొసైటీల ద్వారా కొత్తరుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని విన్నవించారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైరా ఏఎంసీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, ఎంపీటీసీ కొమ్మినేని ప్రభాకర్‌రావు, మాజీ జడ్పీటీసీ మూకర ప్రసాద్, మాజీ ఎంపీటీసీ పగడాల లచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ పోట్రు శరత్‌బాబు, నాయకులు సామినేని రామఅప్పారావు, మర్సకట్ల బాబూరావు, తవిడిశెట్టి యుగేందర్ పాల్గొన్నారు.


మంత్రి తుమ్మలతో మాట్లాడుతున్న నాయకులు

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం

» ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు

వైరా/కొణిజర్ల/ఏన్కూరు/జూలూరుపాడు, ఏప్రిల్ 10: కేంద్రంలో మూడోసారి మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు ధీమా వ్యక్తం చేశారు. ఆయా పట్టణాల్లో, మండలాల్లో బుధవారం వినోదరావు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రపంచానికే ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు, కార్మికులు బీజేపీ వైపు ఆకర్షితులై బ్రహ్మరథం పడుతున్నారని, ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నెల్లూరి కోటేశ్వరరావు, శ్యామ్‌రాథోడ్, గోంగూర వెంకటేశ్వరరావు, రుక్మారావు, బండారు నరేష్, కోటేశ్వరరావు, తుప్పతి నరేష్, కొల్లి సుధాకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరు కోటేశ్వరరావు, పారుపల్లి సురేష్, బిజెపి నాయకులు మాదినేని సతీష్, నున్నా రమేష్, సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


జూలూరుపాడులో మాట్లాడుతున్న తాండ్ర వినోదరావు

రైతన్నపై తగ్గనున్న భారం

ఏటా సాగు చేసేందుకు రైతులు విత్తనాల కొనుగోలుకు చాలా ఖర్చు చేస్తుంటారు. రోజు రోజుకు వీటి ధర పెరిగిపోవడంతో, వారిపై ఆర్థిక భారం పడుతోంది. ఈ విషయాన్ని గమనించిన సర్కారు వానాకాలం నుంచి రాయితీపై విత్తనాలను సరఫరా చేయాలని ప్రణాళికలు రూపొందిస్తోంది. సబ్సిడీతో లక్షలాది మంది అన్నదాతలకు ఊరట దక్కనుంది. అయితే గత ప్రభుత్వం రైతుబంధు పథకం తీసుకొచ్చాక, రాయితీ ఎత్తివేసింది. ఇప్పుడు తిరిగి రాయితీ విత్తన పథకాన్ని పునరుద్ధరిస్తే అన్నదాతలకు మేలు చేకూరనుంది.

» రాయితీ విత్తనంపై కసరత్తు చేస్తున్న ప్రభుత్వం » సబ్సిడీ ఇస్తే తగ్గనున్న ధరలు

» గత సీజన్‌లో 25కిలోల వరి విత్తనాలు రూ.887నుంచి రూ.1059 వరకు విక్రయం



ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 10: ఏటా సాగు చేసేందుకు రైతులు విత్తనాల కొనుగోలుకు చాలా ఖర్చు చేస్తుంటారు. రోజు రోజుకు వీటి ధర పెరిగిపోవడంతో, వారిపై ఆర్థిక భారం పడుతోంది. ఈ విషయాన్ని గమనించిన సర్కారు వానాకాలం నుంచి రాయితీపై విత్తనాలను సరఫరా చేయాలని ప్రణాళికలు రూపొందిస్తోంది. సబ్సిడీతో లక్షలాది మంది అన్నదాతలకు ఊరట దక్కనుంది. గతంలో కంది, మొక్కజొన్నతో పాటు ఇతర మెట్టపంటలకు 35 నుంచి 50 శాతం వరకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలను సరఫరా చేసింది. అలాగే వరికి కూడా అందించిన సందర్భాలున్నాయి. ఈ అవకాశాన్ని చాలా మంది రైతులు సద్వినియోగం చేసుకున్నారు. అయితే గత ప్రభుత్వం రైతుబంధు పథకం తీసుకొచ్చాక, రాయితీ ఎత్తివేసింది. ప్రభుత్వమే సరఫరా చేయడంవల్ల నాణ్యతగా ఉంటాయి. ఇప్పుడు తిరిగి పునరుద్ధరిస్తే అన్నదాతలకు మేలు చేకూరనుంది.

జిల్లాలో కూసుమంచి, మధిర, సత్తుపల్లి, వైరా, కల్లూరు, నేలకొండపల్లి తదితర మండలాల్లో రైతులు పెద్ద ఎత్తున వ్యవసాయం చేస్తుంటారు. వీరికి విత్తన భారం ఎక్కువే. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రాయితీని తిరిగి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి, మినుములు, కంది విత్తనాలకు ముందుగా ఇవ్వాలని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. మొక్కజొన్నతో పాటు ఇతర మెట్ట పంటల విత్తనాలకు కూడా రాయితీ ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీని వల్ల తమకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా వరితో పాటు మొక్కజొన్న, పత్తి, కంది, జొన్న, పెసర వంటి పంటలను లక్షల ఎకరాల్లో సాగు చేస్తుంటారు. వానాకాలంలో సుమారు 6లక్షల లక్షల ఎకరాల్లో సాగు చేస్తారు. అలాగే యాసంగిలో 2.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయి. ముఖ్యంగా వరి ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తారు. వానాకాలంలో సుమారు 4లక్షల ఎకరాలు, యాసంగిలో 2 లక్షల ఎకరాల్లో సాగు చేస్తారు. అలాగే మొక్కజొన్న, కంది, పెసర ఇతర పంటలు వేల ఎకరాల్లో ఉంటాయి. వరి విత్తనాలు సుమారు 60 వేల క్వింటాళ్లు అవసరం ఉంటాయి. వరితోపాటు ఇతర పంటల విత్తనాలకు ప్రతి ఏటా రైతులకు సుమారు రూ.8 కోట్ల భారం పడుతోంది. అంతేకాకుండా ప్రతి ఏటా విత్తనాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్నదాతలకు భారం తగ్గేది ఇలా...

రైతులకు అందించే వరి విత్తనాలకు గత విధానంలో ప్రభుత్వం కిలో ఒక్కంటికి రూ.5నుంచి రూ.10 వరకు రాయితీ ఇస్తే 25కిలోల విత్తన సంచి ధర రూ. 125నుంచి రూ. 250 వరకు తగ్గే అవకాశం ఉంది. కంది, పెసర విత్తనాలపై 50 శాతం రాయితీ ఇచ్చారు. ప్రస్తుతం పెసర నాలుగు కిలోల సంచి ధర రూ. 424 ఉండగా, కందులు రూ.452, మినుములు రూ. 424గా ఉంది. వీటిపై రాయితీ వర్తింపచేస్తే ప్రస్తుత ధరలలో సగానికే రైతులకు లభించే అవకాశం ఉంటుంది. వేరుశనగ 30కిలల సంచి ప్రస్తుత ధర రూ.2,865 ఉండగా, మొక్కజొన్న 5కిలోల సంచి ధర రూ.600గా విక్రయిస్తున్నారు. పచ్చిరొట్ట విత్తనాలు జీలుగు, పిల్లి పెసర, జనుముల విత్తనాలకు 65శాతం సబ్సిడీ ఇస్తున్నారు. గత వానాకాలం సమయంలో వరిలో బీపీటీ-204 రకం విత్తనాలు 25కిలోల సంచి రూ. 887.50, ఎంటీయూ-1010రకం రూ.882, పీకేవీ హెచ్ఎంటీ రకం రూ.1059, ఆర్ఎన్ఆర్ రకం రూ.882కు విక్రయించారు. వీటిపై రాయితీ ప్రకటిస్తే ధరలు తగ్గనున్నాయి.

ఎన్నికల తర్వాత ఉద్యోగ సంఘాల జేఏసీ ఏర్పాటు

● టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్ 10: ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సి న అన్ని బకాయిలను చెల్లించాలని, ఇందుకోసం పోరాడేందుకు లోక్‌సభ ఎన్నికల తర్వాత అన్ని సంఘాలను ఐక్యం చేసి జేఏసీని ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని టీజీవో కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో 6లక్షల 40వేల మంది ఉద్యోగులకు పదేళ్లుగా బకాయిపడిన డీఏలు జూలై 2022 నాటికి రూ.2,500కోట్లు, జనవరి 23నాటికి రెండో డీఏ రూ.1,800 కోట్లు, జూలై 2023 నాటికి రూ.1,100 కోట్లు మొత్తంగా రూ 5,400 కోట్లు ఉద్యోగులకు బకాయిలున్నాయన్నారు. ఉద్యోగుల న్యాయమైన ఈ బకాయిలను ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత దశలవారీగా సాధిస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి త్రీమేన్ కమిటీకి ఉద్యోగుల సమస్యలను నివేదించినట్లు ఆయన తెలిపారు.317 జీవోతో భార్యాభర్తలు చెరొక చోట పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2024 మార్చి 31లోపు పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులు రీషెడ్యూల్ చేయాలని కోరారు. సాధారణ బదిలీలను కౌన్సిలింగ్ పద్ధతిలో నిర్వహించాలని పేర్కొ న్నారు. సమావేశంలో టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీజీవో మహిళా నాయకురాలు సుధారాణి, విజయలక్ష్మి, డీపీ గణేష్ సతీష్, మోదుగు వెంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

'వడదెబ్బ నుంచి రక్షించుకుందాం'

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 10: వడదెబ్బ ప్రమాదకరమని దీనిపట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ విస్తృతంగా ప్రచారం చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో 'వడదెబ్బ నుంచి రక్షించుకుందాం' అనే ప్రచార పోస్టర్ కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఎండ వేడి నుంచి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్స్ సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, డీఎఫ్‌వో సిద్దార్థ విక్రమ్ సింగ్, అదనపు డీసీపీ ప్రసాదరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టండి

● కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్10: చెరువుల్లో పేరుకుపోయిన చెత్తను పూడిక తొలగించడం ద్వారా చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు రైతు పంట పొలలకు సారవంతమైన ఎరువుగా ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో చెరువుల పూడికతీత, రైతుల అవసరాలకు చెరువుమట్టి సరఫరాపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నీటిపారుదలశాఖ ఎస్ఈ. నరసింగరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల, ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ఖమ్మం క్రైం, ఏప్రిల్10: ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ నందు బుధవారం రాత్రి అనుమానాస్పద మృతి కింద కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నగరంలోని చెరువుకట్టబజార్‌లో నివాసం ఉంటున్న వడ్లానపు రాములు(54) సారధినగర్‌లోని ఓ వైన్ షాపు నందు పనిచేస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడికి వివాహం జరగడంతో అతని భార్య తో కలిసి నగరంలోని వేరే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. చిన్న కుమారుడు గంజాయి కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్నాడు. కొద్ది రోజులుగా చిన్న కుమారుడిని జైలు నుంచి బయటకు తీసుకు వచ్చేందుకు షూరిటీ సంతకాలు కోసం పలువురి వద్దకు తిరుగుతున్నాడు. ఎవ్వరు సంతకాలు పెట్టకపోవడంతో మంగళవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. తరువాత భార్య సత్యవతితో ఘర్షణ జరిగింది. తరువాత తల్లి తన పెద్ద కుమారుడు కాశయ్యకు ఫోన్ చేసి కత్తిపీటతో తలకు కొట్టుకుని పడిపోయాడని చెప్పడంతో వెంటనే అతడు ఇంటికి వచ్చాడు. రక్తపు మడుగులో ఉన్న తండ్రిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తనకు తానే కొట్టుకుని మృతి చెందాడని పలువురికి మృతుడి భార్య చెప్పడంతో కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య జరిగి ఉండవచ్చని అనుమానం?

కాగా ఈ విషయమై మృతుడి కుమారుడు కాశయ్య తన బావ అయిన అక్కిపల్లి కృష్ణకు సమాచారం అందించాడు. ఈఘటన పై అనుమానం ఉన్నదని కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాని మృతుడి పళ్లు కూడా ఊడిపోయి ఉండటంతో పోలీసులు హత్యగా భావిస్తున్నారు.

ఆర్టీసీ డ్రైవర్, ప్రయాణీకుడిపై దాడి

● నలుగురిపై కేసు నమోదు

జూలూరుపాడు, ఏప్రిల్ 10: నలుగురు ఆకతాయిలు ఆర్టీసీ డ్రైవర్, ఓ ప్రయాణీకుడిపై దాడి చేసిన సంఘటన మండలంలోని మాచినేనిపేటతండా గ్రామం వద్ద బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ డిలక్స్ బస్సు ఖమ్మం నుంచి భద్రాచలం వైపు వెళ్తుంది. ఈక్రమంలో మార్గమధ్యలో మాచినేనిపేటతండా గ్రామం వద్ద అదే గ్రామానికి చెందిన భూక్యా వినోద్, లాకావత్ గణేష్, లాకావత్ శశికుమార్, గుగులోత్ విజయ్‌కుమార్ నలుగురు ఆకతాయిలు రెండు ద్విచక్రవాహనాలను రోడ్డుపై అడ్డంగా పెట్టారు. దీంతో ఆర్టీసీ డ్రైవర్ జలమాని శ్రీనివాస్ బస్సును నిలిపి రోడ్డుపై ఉన్న వాటిని పక్కకు తొలగించాలని వారిని కోరాడు. దీంతో నలుగురు వ్యక్తులు బస్సు అద్దాలను ధ్వంసం చేయడంతో పాటు, డ్రైవర్‌తోపాటు, ప్రయాణీకుడిపై దాడికి పాల్పడ్డారు. సుమారు రూ.21వేలు నష్టం సంభవించిందన్నారు. విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డ్రైవర్ ఫిర్యాదు చేయడంతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జీవన్‌రాజు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన వ్యక్తికి గాయాలు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్10: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణంలోని ఓ దుకాణంలో పని చేస్తున్న నవీన్ మంగళవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా వెంగళరావునగర్ సమీపాన ఆగి ఉన్న మునిసిపాలిటీ ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే అతడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కన్నీళ్లు మిగుల్చుతున్న మిర్చి పంట

» రోజు రోజుకూ తగ్గుతున్న ధరలు » పెట్టుబడులూ వచ్చే పరిస్థితి లేక రైతుల ఆందోళన


మధిర మండలం సిరిపురంలో కల్లాల్లో ఆరబోసిన మిరపకాయలు

మధిరరూరల్, ఏప్రిల్ 10: మిర్చిధర తగ్గడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఆశాజనకంగా ఉన్న మిర్చి ధర ఈ ఏడాది లేకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధిర మండలంలో ఈ ఏడాది 5,950 ఎకరాల్లో రైతులు మిర్చిపంటను సాగు చేశారు. ఎకరాకు రూ.1.70లక్షల నుంచి రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు తెలిపారు. అయితే ఫిబ్రవరి రెండోవారం వరకు రేటు కొంత బాగానే ఉన్నా, ప్రస్తుతం బాగా తగ్గిందని, కొనే నాథుడే కరువయ్యారని రైతులు వాపోతున్నారు. గత ఏడాది మిరప సన్నాలు రూ.24వేల వరకు రేటు పలికింది. ప్రస్తుతం రూ.16నుంచి రూ.17వేల వరకే నడుస్తోంది. లావు రకాలైతే ప్రస్తుతం రూ.12వేలు మాత్రమే ఉంది.

భారీగా పెట్టుబడులు పెట్టి మిర్చి పంట సాగుచేస్తే ధర ఆశాజనకంగా లేకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిరప సూపర్ 10 లావురకాలు, 414లావురకాలు రూ.10నుంచి రూ.12వేల వరకే కొంటున్నారని రైతులు వాపోతున్నారు. తేజ సన్నరకాలు రూ.15వేలు నుంచి రూ.16వేలు రేటు అడుగుతున్నారని పేర్కొన్నారు. మిరపకాయల కోత కూలే ఎకరాకు రూ.మూడున్నర నుంచి రూ.4వేల వరకు ఖర్చయిందని రైతులు తెలిపారు.

ఈ సంవత్సరం తీవ్ర నీటి ఎద్దడి కూడా ఏర్పడటంతో రైతులు తమ మిరప పొలాలకు చాలాదూరం నుంచి పైపుల ద్వారా నీటిని పెట్టారు. ఈ నీటి ఖర్చు కూడా అధిక మొత్తంలో అయింది. కొంతవరకు దిగుబడి ఫర్వాలేదని, రేటు లేకపోవడంతో మెజార్టీ రైతులు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచారు. ప్రస్తుతం పొలాల్లో కల్లాల వద్దకు వచ్చి మిరప కొనేవాళ్లే కరువయ్యారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎంతో కష్టపడి వ్యయప్రయాసలకోర్చి మిరప పంట సాగుచేసిన రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర మనోవేదన చెందుతున్నారు. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

కోత కూలీ రూ.4వేల వరకు ఖర్చు చేశాం..

● పూర్ణచంద్రరావు, రైతు, దేశినేనిపాలెం



18ఎకరాల్లో మిర్చి సాగుచేశాను. ఈ ఏడాది గిట్టుబాటు ధర లేక ఇబ్బందిగా ఉంది. ముఖ్యంగా మిరప కాయలు సన్నాలు కోత కూలీ ఎకరాకు రూ.4వేల వరకు ఖర్చయింది. పెట్టబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

30ఎకరాల్లో మిరప సాగు చేశాను..

● కల్యాణపు శ్రీనివాసరావు, రైతు, సిరిపురం



తాను 30ఎకరాల్లో ఈ సంవత్సరం మిరప పంట వేశాను. 600క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెట్టుబడులు భారీ గా అయ్యాయి. రైతుకు గిట్టుబాటు ధర అందించాలి.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

● భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ అప్రమత్తం గా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు పోలీసులకు సూచించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమీక్ష సమావేశంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ-ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల పోలీస్‌స్టేషన్లలో పని చేసే అధికారులు నిషేధిత మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఏజెన్సీ ప్రాంత పోలీస్‌స్టేషన్లలో నమోదైన పలు కేసుల వివరాలు, అక్కడ ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు సందర్శిస్తూ సరైన భద్రత ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి. సాయి మనోహర్, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు డీఎస్పీలు చంద్రభాను, సతీష్‌కుమార్, రవీందర్ రెడ్డి, పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

చింతకాని, ఏప్రిల్ 10: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని బుధవారం పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ 10 వేల నగదు, ఇంట్లో ఉన్న కొన్ని మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

మట్టి లారీ సీజ్

పాల్వంచ, ఏప్రిల్10: అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీని పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం సీజ్ చేశారు. పాండురంగాపురంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్, ఓనర్లపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

వైరా ఆయకట్టులో సాగునీటి ఎద్దడి

వైరా, ఏప్రిల్ 10: తీవ్ర నీటి ఎద్దడితో ఖమ్మం జిల్లా వైరా మండలంలో ఇప్పటివరకు సమారు 100 ఎకరాల్లో సాగుచేసిన యాసంగి వరిపంట నిట్టనిలువునా ఎండిపోయింది. రైతులు రూ.లక్షల్లో నష్టపోయారు. ఎండిపోతున్న పంట విస్తీర్ణం ఇంకా కొంత పెరగనుంది. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం యాసంగిలో వైరా ఆయకట్టులో 1,293ఎకరాల్లో వరి సాగు చేశారు. వైరా నది నీటి లభ్యత ఆధారంగా పలు గ్రామాల రైతులు వరిసాగు చేశారు. ఎక్కువగా వైరా నది అలాగే జాలిముడి ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌పై అలాగే బోర్లు, బావులు ఇతర చిన్నతరహా నీటి వనరులు, కట్లేరులో నీటి లభ్యతపై ఆధారపడి సాగుచేసిన 1,293ఎకరాల్లో సుమారు 100 ఎకరాల్లో పంట ఎండిపోయింది. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం నీటి ఎద్దడితో 65 ఎకరాల్లో మాత్రమే వరి, రెండెకరాల్లో మొక్కజొన్న ఎండిపోయిందని అధికారికంగా ప్రకటించారు. వైరా రిజర్వాయర్‌లో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోవడంతో నదికి చుక్కనీరు కూడా విడుదల చేసే పరిస్థితి లేదు. పంటను కాపాడుకోనేందుకు తీవ్ర భగీరథ ప్రయత్నాలు చేశారు. ఖర్చుకు సైతం వెరవకుండా కాల్వలు, బావులు తవ్వుకోవడంతోపాటు యుద్ధప్రాతిపదికన పొలాల్లో బోర్లు సైతం వేయించారు. ఒక్కో రైతు ఎకరాకు రూ.35నుంచి రూ.40వేల వరకు నష్టపోయారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


సిరిపురంలో ఎండిపోయిన వరిపంట

నగదు మాయం చేసిన మేనేజర్‌పై ఫిర్యాదు

ఖమ్మంక్రైం, ఏప్రిల్10: బ్యాంక్ ఖాతాలో నగదు మాయం చేసిన బ్యాంకు మేనేజర్‌పై ఓ వ్యక్తి ఖమ్మం వన్‌టౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఏన్కూరుకు చెందిన వేముల రమేష్‌బాబు తన కుమార్తె అమెరికాలో చదువుతుండడంతో నగరంలోని వైరారోడ్డులో ఇండస్ ఇండ్ బ్యాంక్ నందు ఎడ్యుకేషన్ రుణం కింద రూ.30లక్షల నగదు ఇటీవల తీసుకున్నాడు. వాటిలో నుంచి కుమార్తె ఫీజు చెల్లించేందుకు అకౌంట్‌లోని నగదు ట్రాన్స్‌ఫర్ చేయాలని రూ.6.50లక్షల చెక్కును ఇండస్ ఇండ్ బ్యాంక్ మేనేజరైన కొంగర రామకృష్ణకు చెక్కును ఇచ్చాడు. ఆచెక్కుకు సంబంధించిన నగదును తన కుమార్తెకు పంపకుండా బ్యాంక్ మేనేజర్‌కు తెలిసిన వ్యక్తి అయిన మన్నె లక్ష్మినారాయణకు నగదు పంపించాడు. దీంతో బాధితుడు బ్యాంకు వద్దకు వెళ్లగా, బ్యాంకు మేనేజర్ అతడికి కనిపించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో సదరు బ్యాంకు మేనేజర్ పలువురిని ఇలాగే మోసం చేసినట్టు తెలియడంతో బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పండితాపురం ఘర్షణ ఘటనలో 28మందిపై కేసు నమోదు

కామేపల్లి, ఏప్రిల్ 10: కామేపల్లి మండల పండితాపురం గ్రామంలో ఉగాది పండుగ రోజు కాంగ్రెస్, టీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగిన విధితమే. కాగా కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు చెందిన 28మంది కార్యకర్తలపై కేసులు నమోదైనట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు.

పోడుభూమి చేజారుతుందని...

» బీట్ ఆఫీసర్‌పై గొత్తికోయల దాడి

» ములకలపల్లి మండలం చలమన్ననగర్ అటవీప్రాంతంలో ఘటన


గాయాలను చూపిస్తున్న ఎఫ్‌బీవో వెంకన్ననాయక్

ములకలపల్లి, ఏప్రిల్ 10: అటవీ భూముల్లో చెరువు నిర్మాణం విషయంలో కొందరు పోడు సాగుదారులు ఓ అటవీ అధికారిపై దాడికి పాల్పడ్డారు. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండల పరిధిలోని గుండాలపాడు పంచాయతీ చలమన్ననగర్ అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చందన్ననగర్ పరిసర అటవీ ప్రాంతంలో కొన్నేళ్లుగా గొత్తికోయలు అడవిని నరికి పోడు సాగు చేస్తున్నారు. అయితే ఆయా భూములకు ప్రభుత్వం సాగుదారులకు ఎలాం టి హక్కు పత్రాలు ఇవ్వలేదు. అయితే ఇటీవల ఆ భూములకు సరిహద్దున అటవీభూముల్లో అటవీశాఖ అధికారులు చెరువు నిర్మాణం చేపట్టారు. అయితే ఆ చెరువు నిర్మాణం కోసం అధికారులు తమ భూములను కూడా తీసుకుంటారని భావించిన పోడు సాగుదారులు అక్కడ చెరువు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో బుధవారం చెరువు నిర్మాణ ప్రాంతానికి వెళ్లిన చలమన్ననగర్ బీట్ ఆఫీసర్(ఎఫ్‌బీవో) వెంకన్ననాయక్‌తో అదే గ్రామానికి చెందిన గొత్తికోయలైన పోడు సాగుదారులు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఎఫ్‌బీవోపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో ఎఫ్‌బీవో వెంకన్ననాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విధుల్లో ఉన్న ఫారెస్ట్ బీట్ అధికారి వెంకన్ననాయక్‌పై సుమారు 15మంది పోడుసాగుదారులు కర్రలతో దాడి చేసినట్లు అటవీశాఖ ఉద్యోగులు తెలిపారు. ఈ దాడిలో వెంకన్ననాయక్‌కు తీవ్ర గాయాలు కాగా అటవీ సిబ్బంది వెంటనే అతడిని పాల్వంచ ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన వారిపై అటవీశాఖాధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మార్కెట్‌కు నాలుగు రోజుల సెలవులు

ఖమ్మంమార్కెట్, ఏప్రిల్ 10: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు నేటి నుంచి ఈనెల 14 వరకు వరుసగా నాలుగు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రటరీ ప్రవీణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రంజాన్ పండుగ సందర్భంగా, 12న శుక్రవారం రంజాన్ మరుసటిరోజు సెలవు, 13, 14 శని, ఆదివారాలు వారాంతపు సెలవులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మార్కెట్‌లో తిరిగి ఈనెల 15 సోమవారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా ఉంటాయని తెలిపారు. రైతులు సెలవుల విషయాన్ని గ్రహించాలని కోరారు.

అనుమానంతో భార్యను హతమార్చాడు..

● నర్సింహులగూడెం గ్రామంలో విషాదం

కూసుమంచి, ఏప్రిల్ 10: అనుమానం అతడిని వెంటాడింది.. దీనికి కుటుంబకలహాలు తోడయ్యాయి. ఈ క్రమంలో అతడు రాక్షసుడిగా మారి భార్యను కత్తితో పాశవికంగా హత్య చేశాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నర్సింహులగూడెం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బొల్లికొండ మల్లమ్మ(50), మల్లయ్య దంపతులు వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఒక కొడుకు, కూతురు వివాహం జరగగా, మరొక కొడుకు పెళ్లికి ఉన్నాడు.

ఈ క్రమంలో కొంతకాలంగా ఇద్దరి మధ్యగొడవలు జరుగుతున్నాయి. భార్య మల్లమ్మపై మల్లయ్య అనుమానం పెట్టుకున్నాడు. బుధవారం ఇంట్లో కుటుంబ సభ్యులందరూ పనుల నిమిత్తం బయటకు పోయింది చూసి, భార్య మల్లమ్మపై కత్తితో కిడ్నీల ప్రాంతంతో పొడిచాడు. చుట్టుపక్కలవాళ్లు వెంటనే ఆమెను ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలు కావడంతో చికిత్స పొందుతూ దుర్మరణం చెందింది. భర్త మల్లయ్య పరారీలో ఉన్నాడు. కూసుమంచి పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తలింగాల హుండీ ఆదాయం లెక్కింపు

కామేపల్లి, ఏప్రిల్ 10: మండల పరిధిలోని కొత్తలింగాలలో కోటమైసమ్మ తల్లి అమ్మవారి జాతర బుధవారంతో ముగిసింది. ఈసందర్భంగా ఆలయ హుండీ లెక్కింపును దేవాదాయ పరిశీలకురాలు సమత, నిర్వహణ అధికారి నల్లమోతు శేషయ్య సమక్షంలో లెక్కించారు. ఆదాయం రూ.50,382, పూజ టికెట్లపై రూ.12,000 వచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, ఎం పీటీసీ జగన్నాథరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాసరావు, శంకరయ్య, గోపిరెడ్డి, కిరణ్, వీరయ్య పాల్గొన్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా: జడ్పీ చైర్మన్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 10: లోక్‌సభ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు అవుతున్న సందర్భంగా బుధవారం నిర్వహించాల్సిన ఖమ్మం జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ స్పష్టం చేశారు. సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించేందుకు జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వినోద్ సమావేశానికి హాజరయ్యారు. కనీస కోరం పూర్తి అయ్యేందుకు 1/3 వంతు సభ్యులు హాజరుకాకపోవడంతో ఉదయము 10 గంటల నుంచి 11 గంటలకు సభను వాయిదా వేశారు. ఆ తరువాత 11 గంటలకు సమావేశం నిర్వహించుటకు కనీస సభ్యులు హాజరుకాలేదన్న కారణంతో సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఈ సమావేశానికి జడ్పీ అధికారులు సిబ్బంది హాజరయ్యారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

▸ నోడల్ అధికారులతో కలెక్టర్ గౌతమ్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 10: ఎన్నికల నోడల్ అధికారులు, తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని, పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, నామినేషన్ సహాయక కేంద్రాల ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్, ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన పై అవగాహనకల్పించారు. ఎన్నికలకు సబంధించి ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల మేరకు అన్ని ముందస్తు చర్యల్లో వేగం పెంచాలన్నారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ఉందని, నామినేషన్ లకు సంబంధించి సామగ్రి, ఎలక్షన్ కమిషన్ నుంచి నామినేషన్ ప్రింటెడ్ పత్రాలు, బ్లాంక్ నామినేషన్ పత్రాలు అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేసి, పోటీచేసే అభ్యర్థి, ప్రపోజర్ల ఓటు హక్కు ఉన్నది లేనిది చూడడం, పోస్టల్ బ్యాలెట్లు, ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్, ఆబ్సెంటీ ఓటర్లు, 85 సంవత్సరాల వయస్సు దాటిన సీనియర్ సిటీజన్లు, దివ్యాంగులు, ఎస్సెన్షియల్ సర్వీసెస్ లో పనిచేసే వారికి ఫారం 12, 12ఏలు తీసుకోవాలన్నారు. ఎన్ఐసీ పోర్టల్ నుండి ఎవరు, ఎక్కడ పని చేస్తున్నదీ నివేదిక తీసుకొని, దాని ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. గత ఎన్నికలో హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించిన వారికి తిరిగి కల్పించాలన్నారు. మే 3 నుంచి హోం ఓటింగ్ చేపట్టనున్నట్లు, దీనికి అన్ని చర్యలు చేపట్టాలన్నారు. సెగ్మెంట్లలో ఈవీఎంల భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేయాలని, పోస్టల్ బ్యాలెట్లు భద్రపర్చడానికి మండల స్థాయిలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుచేయాలన్నారు. ఈ సమీక్ష లో అదనపు కలెక్టర్స్ సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, డిఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్, అదనపు డిసిపి ప్రసాదరావు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఎన్నికల సహాయక కేంద్రం ప్రారంభం

కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన లోకసభ ఎన్నికలు-2024 సహాయక కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ బుధవారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో ప్రజలకు ఓటరు సంబంధ సమస్యలు, సందేహాలకు, జాబితాలో పేరు ఉన్నది లేనిది, ఏ పోలింగ్ స్టేషన్‌లో ఓటు ఉన్నది తెలుసుకోవటానికి సూచనలు, సహాయం చేస్తారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. లోకసభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు బ్లాంక్ నామినేషన్ పత్రాలు ఇవ్వటం, నామినేషన్ పత్రాలు పూర్తిచేయడంలో సలహాలు, సందేహాల నివృత్తిచేయటం, ఓటరు జాబితాలో అభ్యర్థి పేరు, అభ్యర్థుల ప్రపోజర్ల పేర్లు ఉన్నవి లేనివి చూస్తారన్నారు. ఎన్నికల సంఘం నుంచి వచ్చిన నామినేషన్ పత్రాలు ఇస్తారని, ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేయొద్దన్నారు. నామినేషన్ పత్రాల్లో తేడాలు ఉంటే సమస్యలు వస్తాయని, అందువల్ల సహాయక కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, జిల్లా రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, మాస్టర్ ట్రైనర్లు కె.శ్రీరామ్, మదన్‌గోపాల్, కలెక్టరేట్ ఏవో అరుణ, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్లు రాంబాబు, సత్యనారాయణ, వి.వెంకన్న, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించవద్దు: ఏఆర్‌వో

ఖమ్మం రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలకు లోబడే నడుచుకోవాలని నిబంధనలు అతిక్రమించవద్దని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాజేశ్వరీ తెలిపారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో బుదవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ఓ మాట్లాడుతు ఎన్నికల అధికారులు నిరంతరం గ్రామాల్లో, పార్టీల అభ్యర్థులపై నిఘా ఉంచుతామన్నారని నిబంధనలు అతిక్రమించకుండా ప్రజస్వామ్య పద్దతిలో ఎన్నికల ప్రచారం నిర్వహించాలని సూచించారు. అనంతరం బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఏఆర్ఓ రాజేశ్వరీ బీఎల్ఓలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, ఎన్నికల డిప్యూటి తహసీల్దార్ రవీందర్, ఎన్నికల అధికారులు, రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలపై ప్రత్యేకదృష్టి

▸ పరిశీలనకు ప్రత్యేక అధికారులు

▸ ఐదు ప్రత్యేక బృందాల ఏర్పాటు

ఖమ్మంకార్పొరేషన్, ఏప్రిల్ 10: భూగర్భజలాలు పడిపోతున్న నేపధ్యంలో ఇంకుడు గుంతల నిర్మాణంపై నగరపాలకసంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఆదేశాలు జారీచేశారు. అంతేకాకుండా ఇంకుడుగంతల నిర్మాణాల పరిశీలనకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టని ఇళ్ల యజమానులకు నోటీసులు ఇస్తున్నారు.

నూతన నిర్మాణాల వద్ద ఇంకుడుగుంత తప్పనిసరి

భూగర్భజలాలు పెంచేందుకు నూతన గృహాలు నిర్మించినప్పుడు ఇంకుడుగుంతల నిర్మాణం తప్పనిసరిగా చేపట్టాలని నగరపాలకసంస్థ అధికారులు ఆదేశాలు జారీచేశారు. 300 చదరపుమీటర్లు (సుమారు 360 చదరపుగజాలు) స్థలంలో నిర్మాణాలు చేపట్టేవారు తప్పనిసరిగా ఇంకుడుగుంతలు నిర్మించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని నగరపాలకసంస్థ అధికారులు హెచ్చరిస్తున్నారు. అవసరమైతే నిర్మాణాల అనుమతిని రద్దు చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ఇంకుడు గుంతలతో ఎన్నో ఉపయోగాలు

వర్షపునీటిని ఒడిసిపట్టేందుకు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని అధికారులు పేర్కొంటున్నారు. వర్షపునీరు వృథాగా వెళ్లకుండా ఈ గుంతల్లోకి వెళ్లే ఏర్పాటు చేస్తే భూగర్భజలాలు పెరుగుతాయని అధికారులు తెలియజేస్తున్నారు. వాస్తవంగా ఇళ్ల నిర్మాణాలు చేప ట్టే సమయంలో ఇంకుడుగుంతల నిర్మాణం తప్పనిసరని గతంలో ఆదేశాలు ఉన్నప్పటికీ ఇటీవల వరకు ఎవరూ పట్టించుకోలేదు. ఈ ఎండాకాలం లో భూగర్భజలాలు అ డుగంటిపోవటం, తాగునీటి ఎద్దడి ఏర్పడటంతో మళ్లీ ఇంకుడుగుంతల నిర్మాణంపై దృష్టి పెట్టారు.



ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పరిశీలనకు ప్రత్యేక బృందాలు

నూతనంగా ఇళ్లు నిర్మించేటప్పుడు ఇంకుడుగుంతలు నిర్మాణం చేపడుతున్నారా? లేదా? అనే విషయాన్ని పరిశీలించేందుకు నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఐదు ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ బృందాల్లో సహాయ కమిషనర్ సంపత్‌కుమార్‌తో పాటు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వసుంధర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, టెక్నికల్ సహాయకులు ఉన్నారు. వీరు నూతన నిర్మాణం జరిగే ప్రాంతానికి వెళ్లి అక్కడ ఇంకుడుగుంతలు నిర్మాణాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. ఇంకుడుగుంతలు నిర్మించని వారికి నోటీసులు ఇస్తున్నారు. ఇలా ప్రతి నిర్మాణం వద్ద ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసేలా నగరపాలకసంస్థ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

16న న్యాయవాద సహకార సంఘం ఎన్నికలు

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 10: న్యాయవాదుల సహకార సంఘానికి ప్రతీ సంవత్సరం రొటేషన్ పద్ధతి ప్రకారం నలుగురు డైరెక్టర్లకు ఎన్నికలు 16న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి గుడేటి రమేష్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 16న ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు ఖమ్మం బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించనున్నారు. ఆరుగురు అభ్యర్థులు సొసైటీ డైరక్టర్లుగా పోటీలో ఉన్నట్టు ఎన్నికల అధికారులు తెలిపారు.

21న సత్తుపల్లికి రానున్న ఈవీఎంలు

సత్తుపల్లి, ఏప్రిల్ 10: వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ నిమిత్తం ఈనెల 21న సత్తుపల్లికి ఈవీఎంలు రానున్నట్లు సత్తుపల్లి తహసీల్దార్ కే.యోగీశ్వరరావు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు. పట్టణంలోని జ్యోతి నిలయం స్కూల్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచి తాళం వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా వాహనాలు విక్రయించడంపై కేసు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 10: అక్రమంగా ద్విచక్రవాహనాలు విక్రయించిన ఘటనపై బుధవారం రాత్రి ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు అయ్యింది. నగరంలోని సుగ్గలవారి తోటకు చెందిన గుండా సాయి సందీప్ ఓ ఫైనాన్స్‌లో రికవరి ఏజెంటుగా విధులు నిర్వహిస్తున్నాడు. కిస్తీలు కట్టలేదని గత మార్చిలో నలుగురి వద్ద ద్విచక్ర వాహనాలు తీసుకు వెళ్లాడు. ఇటీవలె మరో ఏజెంట్ వాహనాలు యజమాని వద్దకు వెళ్లడంతో సందీప్ వాహనాలు తీసుకెళ్లినట్టు తెలిసింది. దీంతో బాధితుల లోని ఒక్కరు వారి వాహనాలు సందీప్ తీసుకు వెళ్లి వేరే వారికి విక్రయించాడని ఆరోపిస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమ మైనింగ్ చేస్తే చర్యలు

● మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ సాయినాథ్

కామేపల్లి, ఏప్రిల్ 10: చెరువుల్లో అక్రమ మైనింగ్ చేస్తే చర్యలు తప్పవని మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సాయినాథ్ అన్నారు. ఇటీవల పండితాపురం గ్రామంలో జరుగుతున్న ఘర్షణలకు కారణం అక్రమ మట్టి తోలకాలేనని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ముచ్చర్ల క్రాస్ రోడ్‌లోని చాకిరేవు కుంటను క్షేత్రస్థాయిలో పరిశలించారు. చెరువులో మట్టి తోలకాలు సంబందించిన అనుమతులను తదితర అంశాలను జేఈ వినోద్‌ను అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలకు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా మట్టి తోలకాలు చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ సుధాకర్, మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, గిర్దావర్ సక్రాం తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ కూలీ కాలుకి గాయం

కామేపల్లి, ఏప్రిల్ 10: కామేపల్లి మండలం లాల్యా తండకు చెందిన లావుడ్యా సక్రు ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామి పనికి బుధవారం వెళ్లాడు. పని చేస్తున్న క్రమంలో కాలుకు గడ్డపార గుచ్చుకొని తీవ్ర రక్తస్రావం అయింది. 108తో కామేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చలి వేంద్రం ప్రారంభం

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 10: వేసవిలో ప్రజల దహార్తిని తీర్చేందుకు కాంగ్రెస్ నాయకులు ముందుకు వచ్చి ప్రతీ కూడలిలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం గాంధీచౌక్‌లోని తారకరామా ఆటో స్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంబించారు. మాజీ కార్పొరేటర్ యర్రం బాలగంగాధర్‌తిలక్, నాయకులు బాణాల లక్ష్మణ్, బోజడ్ల సత్యనారాయణ, రవి, శ్రీశైలం, దానాల పేరయ్య, గంగవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హోంగార్డులకు సన్మానం

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 10: కమిషనరేట్ పరిధిలో హోంగార్డులుగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ తిరుమలరాజు, నాగయ్యలను సీపీ సునిల్‌దత్ తన కార్యాలయంలో బుధవారం సన్మానించారు. సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి పోలీసుశాఖకు సేవలతో అధికారుల మన్ననలు పొందారని సీపీ తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, హోంగార్డు ఆర్ఐ సురేష్, హెడ్‌కానిస్టేబుల్ దత్తురాం, మహ్మద్ రఫీ, శ్రీను, వెంకన్న, రవిబాబు, గురుమూర్తి, గౌస్, పవన్ పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత

వైరా, ఏప్రిల్ 10: వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో వైరాకు చెందిన బీటెక్ విద్యార్థిని పణితి నేహశ్రీకి బుధవారం ల్యాప్‌టాప్ వితరణగా అందజేశారు. వైరా గ్రేట్ విజన్‌క్లబ్, లయన్స్ విద్యాట్రస్టు ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులకు రాయితీపై ల్యాప్‌టాప్‌లు అందజేసి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నిర్వాహకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉంగ్రుడు వరలక్ష్మీ, శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

▸ కలెక్టర్ గౌతమ్ ▸ వీ వెంకటాయపాలెం పల్లె దవాఖాన తనిఖీ

రఘునాథపాలెం, ఏప్రిల్ 10: పల్లే దవాఖానాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉంచాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, పిల్లలకు వ్యాధి నిరోదక టీకాల నుంచి గర్భిణుల నమోదు వరకు ప్రభుత్వ వైద్యసేవలు అందించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం పల్లే దవాఖానాను బుధవారం కలెక్టర్ ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఓఆర్ఎస్, మందులు నిల్వలను పరిశీలించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేసే మందుల తుది గడువును పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న వ్యాధి నిరోదక టీకాలు, గర్భిణీలు ఆన్‌లైన్ నమోదు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పుస్తక నిర్వాహణ, ఔషద నిల్వలు, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. పల్లే దవాఖానాలో అందుబాటులో ఉన్న వైద్యసేవలపై ఏఎన్ఎం మేడా పుష్పావతిని కలెక్టర్ ప్రశ్నించారు. ఉపాధి హామి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పల్లే దవాఖానాల నుంచి పంపిణీపై తెలుసుకున్నారు. వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పల్లే దవాఖాన వైద్యురాలు విధుల్లో చేరకపోవటంపై కారణాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, మండల వైద్యాధికారి బాలకిషన్‌ను ఆడిగారు. పల్లే దవాఖానకు తాగునీటి సరఫరా కల్పించక పోవటంపై స్ధానిక పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ చేయాలని ఆదేశించారు. వైద్య పర్యవేక్షకులు నర్సయ్య, నిర్మలజ్యోతి, కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

▸ సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, ఏప్రిల్ 10: కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మండలంలోని ముగ్గువెంకటాపురం, పేరువంచ, కొర్లగూడెం గ్రామాల్లో బుధవారం రాగమయి పర్యటించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రవేశ పెట్టబోయే పథకాల గురించి వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలు అందరికి అందుతున్నాయని అన్నారు. మండలంలోని ముగ్గువెంకటాపురం, పేరువంచ, కొర్లగూడెం గ్రామాల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి బుధవారం క్షేత్ర స్థాయిలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాలను సందర్శించి పరిశీలించారు. జాబ్ కార్డు కలిగిన వారందరికి పనులు కల్పిస్తున్నారా? అని ఎమ్మెల్యే రాగమయి కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాబ్‌కార్డు కలిగిన వారందరు ఉపాధి పనులు పొందాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు దండు ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు పోట్రు సత్యం, కీసర మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గాదే కిరణ్, వణుకూరి ప్రభాకర్, మట్టా రామకృష్ణ, బాగం ప్రభాకర్‌రావు ఉస్మాన్, తురాబలి తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

బాధిత కుటుంబాలకు సండ్ర పరామర్శ

కల్లూరు, ఏప్రిల్ 10: కల్లూరు పట్టణంలో బుధవారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బాధిత కుటుంబాలను పరామర్శించారు. శాంతినగర్‌లో న్యూడెమోక్రసీ, హమాలీ కార్మిక సంఘం నాయకుడు సీతారాములు మాతృమూర్తి నలగట్ల రామలక్ష్మీ మృతి చెందగా సమాచారం అందుకున్న సండ్ర నివాసానికి వెళ్లి రామలక్ష్మీ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ మాజీ వార్డు సభ్యులు దార్ల నరిసింహారావు మాతృమూర్తి ఇటీవల మృతిచెందగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ ఎంఎల్ పార్టీ నాయకుడు ఎ వెంకన్న, బిఆర్ఎస్ నాయుకుడు మేకల కృష్ణ, పెడకంటి రామకృష్ణ, కొరకొప్పు ప్రసాద్, రాచమళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పుల్లారావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న సండ్ర

ప్రశాంతమైన ఖమ్మానికి తొలి అడుగులు: తుమ్మల

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 10: ప్రశాంతమైన ఖమ్మానికి తొలి అడుగులు పడ్తున్నాయని, ప్రజలు అభివృద్ధి నడుమ సుఖ సంతోషాలతో ఉండేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఖమ్మంలోని లోటస్‌హిల్స్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మంత్రి తుమ్మల మాట్లాడారు. స్థానిక సమస్యలను నాయకులు ప్రస్తావించగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందును ఇప్పుడు తానే హామీలు ఇవ్వలేనని వివరించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

రంజాన్ తోఫాల పంపిణీ, ఇఫ్తార్ విందులు

వైరా, ఏప్రిల్ 10: మండలంలోని సిరిపురం గ్రామంలో బుధవారం రాత్రి 120మంది పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. వైరాకు చెందిన ఎన్నారై వేమూరి అజయ్‌కుమార్ ఆర్థికసహాయంతో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ప్రతి ఏటా అజయ్‌కుమార్ ఈ గ్రామంలో ముస్లింలకు రంజాన్ తోఫా అందజేస్తున్నారు. దానిలో భాగంగానే ఒక్కో కుటుంబానికి లీటరు పాలు, ఒక కిలో చక్కెర, అరకిలో షేమియాలు ఉన్న రంజాన్ తోఫాను అందజేశారు. కార్యక్రమంలో పఠాన్ జానీ, షేక్.లతీఫ్, బోధనాచారి, కూరాకుల గోపి, నారపోగు తిరుపతిరావు, షేక్.జమీల్, ఇనపనూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

●కొణిజర్ల: మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో బుధవారం గ్రామంలోని ముస్లింసోదరులకు గ్రామ నివాసి 'గడల సీతారామయ్య' మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుమారుడు గడల భాస్కర్‌రావు గ్రామంలోని సీపీఐ కార్యాలయంలో రంజాన్‌తోఫాను అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, పివిరావు, లేడిబోయిన గోపాల్‌రావు, గడల శ్రీను, పిన్నం పుల్లయ్య, రంజాన్ పాల్గొన్నారు.

●సత్తుపల్లిరూరల్: రంజాన్ మాసం సందర్భంగా 'అమ్మ ఆషాఖాన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం సత్తుపల్లి నియోజకవర్గంలో ఆయా 10గ్రామాలలో రంజాన్ కిట్స్ పంపిణీ చేసినట్లు నిర్వహకులు ఆషాఖాన్ తెలిపారు. రంజాన్-ఏ-తోఫా పేరిటట పండుగు సామాగ్రిని ముస్లీం పేద కుటుంబాలతో పాటు అభాగ్యులు, వికలాంగులు, భిక్షాటన చేసేవారికి బిర్యానీ, సేమియా, దుస్తులు, రంజాన్ కిట్లు ఉచితంగా అందజేశామన్నారు. ముస్లీం కుటుంబాలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే రాగమయి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

సత్తుపల్లి: రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లీం సోదరసోదరీమణులకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సత్తుపల్లి పట్టణంలోని జామె మసీద్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అంతకముందు ఉపవాస దీక్షలో ఉన్న ముస్లీంల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా ఇన్ని రోజుల పాటు నిర్వహించి ఉపవాస దీక్షలకు ఈద్-ఉల్-ఫితర్‌తో ముగింపు వచ్చేసింది.

●తల్లాడ: రంజాన్ మాసం ముగింపు సందర్భంగా తల్లాడలోని బాలభారతి విద్యాలయంలో బుధవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలను కేఎస్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ కోటగిరి శ్రావణి, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలకు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

●వైరా: వైరాలో గురువారం జరుగనున్న రంజాన్ వేడుకలకు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాట్లు చేశారు. వైరా రిజర్వాయర్ ఆనకట్ట సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో రంజాన్ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు చేసుకొనేందుకు వీలుగా పరిసరాలను శుభ్రం చేశారు. మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ షేక్.సైదులు, ముస్లిం పెద్దలు ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జమలాపురంలో తుళ్లూరి జన్మదిన వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం ఏప్రిల్ 10: జమలాపురానికి చెందిన వ్యాపారవేత్త తుళ్లూరి కోటేశ్వరరావు జన్మదిన వేడుకలను గ్రామస్థులు, అభిమానుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.వీఎస్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం బాలాజీ భవన్, గ్రామ తండాలో కేక్ కట్‌చేసి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వీఎస్‌కే ఫౌండేషన్ నిర్వాహకులు కాపర్తి సతీష్, పాతూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వగ్రామంపై మక్కువతో కోటేశ్వరరావు గ్రామానికి, ప్రజలకు సేవచేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వీఎస్‌కే ఫౌండేషన్, కేఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు, అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు యోధుడు రజబ్‌అలీకి సీపీఐ ఘన నివాళి

ఖమ్మం సంక్షేమవిభాగం/వైరా/ఏన్కూరు, ఏప్రిల్ 10: సుదీర్ఘకాలం పాటు శాసన సభ్యులుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ రజబ్‌అలీ అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు కొనియాడారు. ఖమ్మం జిల్లా సీపీఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో బుధవారం దివంగత మాజీ ఎమ్మెల్యే రజబ్‌అలీ 28వ వర్ధంతి సభ నిర్వహించారు. రజబ్‌అలీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సీతా మహాలక్ష్మీ, మేకల శ్రీనివాసరావు, గాదె లక్ష్మీనారాయణ, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

వైరా: వైరాలో బుధవారం మాజీ ఎమ్మెల్యే రజబ్‌అలీ వర్ధంతి నిర్వహించారు. సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు యామాల గోపాలరావు, మిట్టపల్లి రాఘవరావు, నాయకుడు గారపాటి అశోక్ పాల్గొన్నారు.

ఏన్కూరులో జరిగిన రజబ్‌అలీ వర్ధంతి కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జాగర్లముడి రంజిత్‌కుమార్ జిల్లానాయకులు అమరనేని వీరభద్రం, సీనియర్ నాయకులు భూషయ్య, మండల సహాయ కార్యదర్శిబానోతు రాంబాబు, గ్రామ కార్యదర్శి వెంకన్న పాల్గొన్నారు.

జామాయిల్, సుబాబుల్ పంట దగ్ధం

మధిర రూరల్, ఏప్రిల్ 10: మధిర మునిసిపాలిటీ పరిధిలోని అంబార్‌పేట గ్రామలో ఇద్దరు రైతులకు చెందిన ఎనిమిది ఎకరాల జామాయిల్, సుబాబుల్ తోట బుధవారం రాత్రి దగ్ధమైంది. రాత్రి పదిగంటల సమయంలో ఒకసారిగా ఈ ప్రాంతంలో మంటలు లేచాయి. దీంతో గ్రామస్థులు ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైరింజన్ ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించారు. 80శాతం పంట కాలిపోయినట్టు బాదిత రైతులు వెంకటేశ్వర్లు, గోప య్య తెలిపారు. సుమారు. రూ.3లక్షలు నష్టం సంభవించనట్టు రైతులు తెలిపారు.

108 కలశాలతో అష్టోత్తర శత కలశ స్థాపన



కలశాలతో ఆలయ కమిటీ సభ్యులు


ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 10: ఖమ్మం నగర కార్పొరేషన్ 4వ డివిజన్ పరిధి యూపీహెచ్ కాలనీలోని స్వయంభూ శ్రీ అభయ వెంకటేశ్వరస్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం 108 కలశాలతో అష్టోత్తర శత కలశ స్థాపన, అభిషేకం నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.సాయంత్రం సామూహిక కుంకుమపూజ నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బొల్లి కొమరయ్య, ప్రధాన కార్యదర్శి పురం తిరుపయ్య, కోశాధికారి బానోత్ మల్సూర్ నాయక్, పల్లెబోయిన చంద్రయ్య,అల్లిక అంజయ్య, దండా జ్యోతిరెడ్డి, వీరన్న, కొండల్‌రావు, మణికంఠ, వీరబాబు పాల్గొన్నారు.

నేడు స్వామి వారి కల్యాణం

శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాగంగా గురువారం ఉదయం స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం గ్రామోత్సవం(ఊరేగింపు)నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.

ఘనంగా కోటమైసమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు

కారేపల్లి, ఏప్రిల్10: మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలోని కోటమైసమ్మతల్లి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న పవిత్ర బ్రహ్మోత్సలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయట్రస్ట్‌బోర్డు చైర్మన్ దంపతులు డాక్టర్ పట్టాబి రామారావు, విజయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఇల్లెందు పట్టాణనికి చెందిన కూరకాయల మార్కెట్ వ్యాపారస్తులు నారాయణ లోధ్, సురేష్‌లోధ్, జక్కుల రామకోటేశ్వరరావుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాటిపల్లి సుబ్బారావు, మనిచంద్, ఏలూరి మధుబాబు, గండె నరేష్, అరువపల్లి రాధకృష్ణ, రామిడి శంకర్, చందాచక్రదార్, సైపా రాజశేఖర్, ఆలయ పూజారి కైలాష్‌శర్మ, ఎంపీటీసీ మూడు జ్యోతి, బన్సీలాల్, సిబ్బంది ఆలయ సిబ్బంది సాయి, మూడుమోహన్ చౌవాన్, గణితి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దంపతులు

ఆలయ అభివృద్ధికి సహకరించండి

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 10: సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. బుధవారం నిర్వహించిన మొదటి సమావేశంలో పలు తీర్మానాలు చేశారు.

శ్రీ కోదండ రామాలయ నూతన కమిటీ ఎన్నిక

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 10: సత్తుపల్లి పట్టణంలోని శ్రీ కోదండ రామాలయ నూతన కమిటీని ఆలయ ప్రాంగణంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కొత్తూరు సత్యనారాయణ, అనుమోలు సురేష్‌కుమార్, కోశాధికారిగా తోట రమేష్ బాబు, గౌరవ అధ్యక్షుడిగా చలసాని సాంబశివరావు, గౌరవ సలహాదారులుగా కొత్తూరు ప్రభాకరరావు, గుడిమెడ్ల గాంధీ, కోరుకొండ వెంకటేశ్వరరావులతో పాటు మరో 30మంది సభ్యులతో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది.

అర్హులందరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

బోనకల్, ఏప్రిల్ 10: ఓటుహక్కు ప్రాధన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తహసీల్దార్ పున్నం చందర్ సూచించారు. స్థానిక కేజీబీవీలో బుధవారం ఓటుహక్కు వినియోగం పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అర్హులంతా ఓటుహక్కును సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను ప్రలోబాలకు గురి చేస్తే సీ-విజిల్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఎంపీడీవో ఎల్. రాజు, బీఎల్వోలు పాల్గొన్నారు.